



సీఆర్డీఏ భవనానికి జగన్ తెచ్చిన చిక్కులు

- 2019లోనే తుది దశకు ఏడంతస్థుల బిల్డింగ్
- అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ఆపేసిన జగన్
- మాస్టర్ ప్లాన్ మార్చి అడ్డదిడ్డంగా నిర్మాణాలు
- ఇప్పుడు తలనొప్పిగా మారిన నాటి చర్యలు
- అస్తవ్యస్త నిర్మాణాలను సరిదిద్దడమే సవాల్
- ఇప్పటికే 5 కోట్ల ఖర్చు, సమయం వృథా
- భవన నిర్మాణం పూర్తికి మరో నాలుగు నెలలు

8



శవ పంచాయితీ

అక్టోబరులో ప్రభుత్వాసుపత్రికి అనాథ శవం

వైద్య కళాశాలకు ఇచ్చిన అధికారులు

మేమున్నామంటూ ఆలస్యంగా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు

నష్టపరిహారం చెల్లించాలంటూ శుక్రవారం హడావిడి

సాధారణంగా ఎవరైనా ప్రమాదంలో చనిపోయినా, అనుమానాస్పదంగా మరణించినా శవపంచనామా జరుగుతుంది. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం మాత్రం శవ పంచాయితీ జరిగింది. అనాథ శవంగా నిర్ధారించుకుని దాన్ని పొరుగు రాష్ట్రంలోని వైద్య కళాశాలకు ఇచ్చేసిన తర్వాత కుటుంబ సభ్యులు ఇప్పుడు ఆసుపత్రికి చేరుకున్నారు. తమ కుటుంబ సభ్యుడి మృతదేహాన్ని ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఆసుపత్రి అధికారులు తలలు పట్టుకున్నారు.

విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దేవీనగర్‌కు చెందిన గోన శ్యాంసన్ (45) పెయింటర్‌గా పనిచేసేవాడు. ఆయనకు మద్యం అలవాటు ఉంది. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. గత అక్టోబరు 27వ తేదీన మద్యం తాగి పటమటలోని స్టెల్లా కళాశాల ముందున్న సర్వీసు రోడ్డుపై పడిపోయాడు. అతడితో పాటు పనిచేసే కార్మికుడు శ్యాంసన్‌ను ప్రభుత్వాసుపత్రి క్యాజువాలిటీలో చేర్పించాడు. తర్వాత అక్కడి నుంచి ఆ కార్మికుడు వెళ్లిపోయాడు. ఆసుపత్రిలో చేరిన 40 నిమిషాలకు శ్యాంసన్ ప్రాణాలు కోల్పోయాడు. ఆయనకు సంబంధించి బంధువులు ఎవరూ లేకపోవడంతో శ్యాంసన్‌ను అనాథశవంగా గుర్తించారు. ఆసుపత్రి సిబ్బంది మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

నిబంధనల ప్రకారం..

మార్చురీలో ఉన్న అనాథ శవాల గురించి ఆసుపత్రి అధికారులు అవుట్‌పోస్టులో ఉన్న పోలీసులకు సమాచారం ఇస్తారు. వారం రోజుల వరకు వాటిని భద్రపరిచాక ఎవరూ రాకపోతే పోలీసులు వాటిని మున్సిపాలిటీకి సిబ్బందికి అప్పగించి, దహన సంస్కారాలు చేయించుకోవచ్చని నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఇస్తారు. శ్యాంసన్ 27వ తేదీన బయటకు వచ్చిన తర్వాత ఇంటి ముఖం చూడలేదు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వాళ్లెవరూ శ్యాంసన్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఆయన మృతదేహాన్ని మార్చురీలో నవంబరు ఏడో తేదీ వరకు భద్రపరిచారు. శ్యాంసన్‌కు సంబంధించిన వారెవరూ

మిగతా 6లో..

భూ రగడ..!

కర(గ్రహారం అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో వివాదం

- 2005లో తమకు పట్టాలిచ్చారని గ్రామస్తుల వాదన
- పట్టించుకోకుండా పనులు చేయిస్తున్న యంత్రాంగం
- అటవీ అధికారుల తీరుపై మంత్రి కొల్లు రవీంద్రకు ఫిర్యాదు
- భూములను పరిశీలించిన రెవెన్యూ, పోలీస్ అధికారులు
- వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశాలు
- వేరేవారికి కట్టబెట్టే ప్రయత్నాలని గ్రామస్తుల మండిపాటు

కర(గ్రహారంలో అసైన్డ్ భూముల వద్ద పోలీసులు, గ్రామస్తులు



మచిలీపట్నం మండలం కర(గ్రహారం రెవెన్యూ గ్రామ పరిధిలోని అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో వివాదం రాజుకుంది. బందరు పోర్టు పాత శిలాఫలకం సమీపంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను అటవీశాఖ అధికారులు చదును చేయిస్తుండటం వివాదంగా మారింది. గ్రామస్తులకు, అధికారులకు మధ్య జరిగిన వివాదం మంత్రి కొల్లు రవీంద్ర వద్దకు వెళ్లడంతో శుక్రవారం నాటి పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం కర(గ్రహారం గ్రామంలోని ఆర్ఎస్ నెంబరు 269 నుంచి 289లో ఉన్న 100 ఎకరాలకు పైగా భూమిని అటవీ శాఖ అధికారులు రెండు రోజులుగా చదును చేయిస్తున్నారు. అయితే, కర(గ్రహారం, చినకర(గ్రహారం గ్రామస్తులు ఈ పనులను అడ్డుకున్నారు. ఈ సర్వే నెంబర్లలోని కొంత భూమిని పేదలకు ఒక్కో ఎకరం చొప్పున 2005లోనే అసైన్డ్ పట్టాలు ఇచ్చారని అటవీశాఖ అధికారులకు చెప్పారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకోవద్దని చెప్పినా పనులు కొనసాగిస్తున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పనులను అడ్డుకున్న గ్రామస్తులు

కర(గ్రహారంలోని సర్వే నెంబరు 269 నుంచి 289 వరకు ఉన్న భూమిని అటవీశాఖ అధికారులు యంత్రాలతో చదును చేయిస్తున్న పనులను కర(గ్రహారం, చినకర(గ్రహారం గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. పేదలకు పట్టాలు ఇచ్చిన భూములను భవిష్యత్తులో వేరొకరికి కట్టబెట్టేందుకు ఈ ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వేలాది ఎకరాల మడ అడవులు ఆక్రమించేసి రొయ్యల చెరువులుగా మార్చినా, అటవీ శాఖ అధికారులు అటువైపు చూడట్లేదని, వాటిని ఖాళీ చేయించి మడచెట్లను పెంచాలని, పేదలకు పట్టాలిచ్చిన భూములను స్వాధీనం చేసుకుంటే సహించేది లేదని పనులను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని అదుపు చేశారు. యంత్రాలను బయటకు పంపాకే గ్రామస్తులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

సమస్య ఇదీ..

కర(గ్రహారం, చినకర(గ్రహారం గ్రామాలకు, సముద్రానికి మధ్య సహజసిద్ధంగా ఇసుక మేటలు వేసిన వందలాది ఎకరాల భూమి ఉంది. సముద్రంలో తుఫాన్లు సంభవించినపుడు, పెద్ద అలలు వచ్చినపుడు సముద్రపు నీరు గ్రామాల్లోకి చొరబడకుండా ఈ మేటలు అడ్డుగా ఉంటాయి. స్థానికంగా నివాసం ఉండే మత్స్యకారులు లేదా ఎస్టీలు సరుగుడు చెట్లను పెంచి, దానిద్వారా వచ్చే ఫలసాయాన్ని వారే పొందుతున్నారు. 2005వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కర(గ్రహారం రెవెన్యూ గ్రామ పరిధిలోని 70 మందికి పైగా పేదలకు ఒక్కొక్కరికీ ఎకరం చొప్పున పట్టాలిచ్చింది. ఈ భూమిలో కొందరు సరుగుడు తోటలు, మరికొందరు రొయ్యల చెరువులు తవ్వి సాగు చేసుకుంటున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు ఈ భూములను చదునుచేసి మడమొక్కలను పెంచుతామనే ప్రతిపాదన చేశారు. గతంలో ఈ భూములకు తమకు పట్టాలిచ్చారని, ఈ భూముల్లో కాకుండా కర(గ్రహారం రెవెన్యూ గ్రామ పరిధిలో వందలాది ఎకరాల భూమి సముద్రానికి, గ్రామానికి మధ్యన ఉందని, అందులో మడమొక్కలు పెంచాలని గ్రామస్తులు అటవీ అధికారులను కోరారు. అయితే, ఈ ప్రతిపాదనను అధికారులు పట్టించుకోలేదు. పేదలకు ఇచ్చిన భూములను చదును చేయించేందుకు యంత్రాలను తీసుకొచ్చారు. చకచకా పనులు చేయిస్తున్నారు. దీంతో గురువారం ఆర్డీవో ఈ భూములను పరిశీలించారు. శుక్రవారం కలెక్టర్‌తో మాట్లాడి తుది నిర్ణయం చెబుతామన్నారు. అయినా అటవీశాఖ అధికారులు ఈ భూములను చదును చేయించారు.

మిగతా 6లో..

ఎనికేపాడు గోడౌన్‌లో పోలీసుల తనిఖీలు, చోరీ జరగ్గా మిగిలిన సరుకు





యూపీ నుంచి ఏపీ

ఎనికేపాడు గోడౌన్‌లో చోరీ కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

- సీసీ కెమెరాల ద్వారా ఆరుగురు నిందితుల గుర్తింపు
- వారం కిందట రాష్ట్రంలో అడుగుపెట్టిన గ్యాంగ్
- పలాస నుంచి బెజవాడ వరకు పక్కా రెక్కీ
- ఎనికేపాడులో రూ.2.51 కోట్ల విలువైన ఫోన్ల చోరీ
- బిహార్ పారిపోతుండగా పట్టుకున్న పోలీసులు
- అంతర్రాష్ట్ర పోలీసుల సహకారంతో పట్టివేత..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చారు.. కోస్తాతీరాన్ని జల్లెడ పట్టారు.. దొంగతనానికి ఏ ఊరు అనువుగా ఉంటుందో చూసుకున్నారు... టార్గెట్ ప్రకారం స్కెచ్‌ను అమలు చేశారు.. చివరకు పొరుగు రాష్ట్ర సరిహద్దుల్లో పోలీసులకు దొరికిపోయారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో ఇన్‌గ్రాం మైక్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గోడౌన్‌లో జరిగిన చోరీ కేసును విజయవాడ పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి, గోడౌన్‌లో చోరీ చేసి బిహార్‌కు పారిపోతున్న గ్యాంగ్‌కు అంతర్రాష్ట్ర పోలీసుల సహకారంతో సంకెళ్లు వేశారు. చైన్ లింక్ మాదిరిగా 100కి పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి రాత్రికిరాత్రి గ్యాంగ్ ఆచూకీ కొనుగొన్నారు. ఈ వివరాలను త్వరలో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు అధికారికంగా వెల్లడించే అవకాశాలున్నాయి.

అలా వచ్చారు.. : ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ గ్యాంగ్ ఈనెల ఒకటో తేదీన రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్ నెంబరుతో ఉన్న కారులో ఆరుగురు యువకులు ఇక్కడికి వచ్చారు. విజయవాడ నుంచి శ్రీకాకుళం జిల్లా పలాస వరకు పలు ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహించారు. విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, తుని, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, పలాస వరకు పలుమార్లు తిరిగారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఇన్‌గ్రాం మైక్రో ఇండియా గోడౌన్ వద్ద మూడు రోజులపాటు

మిగతా 6లో..

దిశ మార్చేశారు

గోడౌన్‌కు బయట బుల్లెట్ సీసీ కెమెరాలు ఉండటాన్ని నిందితులు గమనించారు. ఆరుగురిలో ముగ్గురు గోడౌన్ లోపలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మరో ముగ్గురు బయట ఉంటూ సరుకును బ్యాగ్‌ల్లో సర్దేలా ప్రణాళికలు వేసుకున్నారు. గోడౌన్‌లోకి దిగిన ముగ్గురు ముందుగా ఎత్తయిన గోడ ఎక్కి అక్కడున్న సీసీ కెమెరాల దిశలను మార్చేశారు. సీసీ కెమెరాలు రహదారిపైకి వెళ్లేవారిని, గోడౌన్‌లోకి వచ్చే వారిని గుర్తించేలా ఏర్పాటు చేశారు. నిందితులు ఈ కెమెరాలను ఆకాశం వైపునకు మార్చేశారు. ఆ సమయంలో వారి ముఖాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. మాస్కులు ధరించకపోవడంతో ఛాయాచిత్రాలు స్పష్టంగా కనిపించాయి. నిందితులు ఉపయోగించిన వాహనంపై ఉన్న స్వస్తిక్ రేడియం స్టిక్కర్ పోలీసులకు ప్రధాన ఆధారంగా ఉపయోగపడింది. వీరిపై ఎక్కడెక్కడ కేసులున్నాయో బయటకు తీసే పనిలో పోలీసులు ఉన్నారు.



ముగిసిన సుబ్బారాయుడి కల్యాణ మహోత్సవాలు

చివరి రోజు ఘనంగా పవళింపు సేవ

6లో

నేటి నుంచి సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు

రెండు రోజుల పాటు నిర్వహణ

మెట్రోకు మౌఖిక అనుమతులివ్వండి

కేంద్ర ప్రభుత్వానికి ఏపీఎంఆర్‌సీ విజ్ఞప్తి

విజయవాడ ఎయిర్‌పోర్టులో అండర్ గ్రౌండ్ మెట్రో రూట్‌కు ఓకే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు మౌఖిక అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) విజ్ఞప్తి చేసింది. మౌఖిక ఆదేశాలు ఇవ్వగానే టెండర్ల ప్రక్రియకు వెళ్లేందుకు సిద్ధం కావాలని భావిస్తోంది. ఈసారి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టులన్నింటికీ నిధులు కేటాయించింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి నూరుశాతం కేంద్ర ప్రభుత్వమే భరించాల్సిందిగా ఏపీఎంఆర్‌సీ నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వెళ్లింది. ఈ ప్రతిపాదనకు కేంద్రం ఏం చెబుతుందో ఆసక్తికరంగా మారింది. మౌఖిక అనుమతులు ఇస్తే ఐదారు నెలల్లోనే టెండర్లకు వెళ్లాలని అధికారులు భావిస్తున్నారు.

భూసేకరణలో కదలిక

ఇప్పటికే 100 ఎకరాల భూ సేకరణలో కదలిక వచ్చింది. ఈ అంశాలపై ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం దృష్టిపెట్టింది. ముఖ్యంగా కేసరపల్లిలో కోచ్ డిపోకు 70 ఎకరాలు కావాల్సి ఉండగా, మిగిలిన 30 ఎకరాలు మెట్రో స్టేషన్లకు అవసరమవుతుంది. ఎక్కడెక్కడ భూములు అవసరమన్నది గతంలోనే నిర్ణయించారు. ప్రస్తుతం భూ సేకరణ జరపాల్సిన ప్రాంతాల్లో పరిస్థితులపై యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

ఎయిర్‌పోర్టులో అండర్‌గ్రౌండ్ మెట్రోకు అనుమతి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అండర్ గ్రౌండ్ మెట్రోకు సంబంధించి ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి అనుమతి వచ్చింది. గన్నవరం నుంచి విజయవాడ వచ్చే కారిడార్-1 అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర ఎయిర్ పోర్టుకు కనెక్టివిటీ అవుతుంది. అండర్ గ్రౌండ్‌లో కారిడార్ వెళ్తుంది. ఎయిర్‌పోర్టులో రెండు కారిడార్స్ వెళ్తుంటాయి. గన్నవరం నుంచి ఎయిర్‌పోర్టుకు, ఎయిర్‌పోర్టు నుంచి యోగాశ్రమం వరకు భూగర్భ విధానంలోనే వెళ్తుంది. దీనికి సంబంధించి త్వరలోనే ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌తో ఏపీఎంఆర్‌సీ అధికారులు సమావేశమయ్యే అవకాశాలున్నాయి.

పవిత్ర సంగమం వద్ద స్నానాలకు అనుమతి లేదు

సింధుస్నాన ఏర్పాట్లపై సమావేశంలో నిర్ణయం

అసంతృప్తిగా ముగిసిన సమావేశం

కోడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి పవిత్ర కృష్ణా సంగమ ప్రదేశంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతి లేదని, సముద్రం వద్ద మాత్రమే స్నానాలు ఆచరించాలని అవనిగడ్డ సీఐ యువకుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుధా ప్రవీణ్ అధ్యక్షతన ఈనెల 12న నిర్వహించే సింధు స్నానాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సాగర తీరాన పవిత్ర స్నానాల ఏర్పాట్లపై నిధులు సమకూర్చడంపై వేణుగోపాలస్వామి ఆలయ పర్యవేక్షకులకు, అధికారులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. పవిత్ర స్నానాలకు వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేస్తారని, వారికి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసేందుకు గ్రామ పంచాయతీ వారికి గతంలో దేవదాయ అధికారులు సహకారం అందించేవారని, ప్రస్తుతం శృంగేరి పీఠానికి దేవదాయ శాఖ బాధ్యతలు అప్పగించడంతో అదేవిధంగా సహకారం అందించాలని ఎంపీడీవో కోరారు. దీనిపై స్పందించిన శృంగేరి పీఠం ప్రతినిధులు తమకు, దేవాలయానికి, సముద్ర స్నానాలకు ఎటువంటి సంబంధం లేదని, దేవాలయానికి వచ్చే ఆదాయ వనరులు లేవని, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ వారు, భక్తుల ఏర్పాట్ల నిమిత్తం నిధులు సమకూర్చుకోవాలన్నారు. 11, 12 తేదీల్లో ట్రాఫిక్ నియంత్రణ నిమిత్తం రెండు రోజులపాటు పాలకాయితిప్ప గేటు వద్ద టోల్‌ఫీజు వసూలు చేయరాదని అటవీశాఖ అధికారులను ఎంపీడీవో కోరారు. నిధులు సమకూర్చుకోవడంపై వాదోపవాదాలు జరగటంతో సమావేశం అసంతృప్తిగా ముగిసింది. తహసీల్దార్ శ్రీనునాయక్, మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి, ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, మెరైన్ ఎస్సై మాధురి, కోడూరు ఎస్సై చాణక్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



శిథిల వంతెనలు

2018లో కూలిన కట్టలేరుపై వినగడప వద్ద బ్రిడ్జి

- ఇటీవల వరదలకు కుంగిన ఎంఎన్‌కే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద ఏడు ఖానాల బ్రిడ్జి
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కొత్త బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్

6లో

నేటి నుంచి వీరమ్మ తిరునాళ్ల

ఉయ్యూరులో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

15 రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు

8లో



బాధ్యతలు స్వీకరించిన మండవ కృష్ణకుమారికి అభినందనలు తెలుపుతున్న విప్ తంగిరాల సౌమ్య

నందిగామ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ప్రమాణస్వీకారం

నందిగామ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'ప్రజాసామ్యబద్ధంగా నందిగామ మునిసిపాలిటీని టీడీపీ కైవశం చేసుకుంది. నిబద్ధత, నిజాయితీ గల మండవ కృష్ణకుమారి నాయకత్వంలో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రణాళికాబద్ధంగా పనిచేసి నందిగామ మునిసిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శంగా నిలుపుతాం.' అని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి శుక్రవారం పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని విప్ తంగిరాల సౌమ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన కృష్ణకుమారిని సౌమ్య సత్కరించారు. పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తానని కృష్ణకుమారి తెలిపారు. ఎస్ఎస్ఎల్‌బీఎస్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, కోగంటి బాబు, కౌన్సిలర్లు, కమిషనర్ రమణబాబు పాల్గొన్నారు

అలసత్వాన్ని వీడి పరీక్షలకు సన్నద్ధం కండి

- పదో తరగతి విద్యార్థులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మూలపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు అలసత్వాన్ని వీడాలని, ఇది ఎంతో కీలకమైన సమయమని, పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు చెప్పారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి నూరుశాతం ఫలితాలు సాధించాలని, అత్యవసరమైతే తప్ప సెలవులు పెట్టొద్దని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఆయన పరిశీలించారు. గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఏడుగురు ఉపాధ్యాయులు సెలవు పెట్టడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో సెలవులు పెట్టడం సరికాదన్నారు. హెచ్ఎం టి.డేవిడ్ రాక్‌ఫెల్లర్, ఆర్ఐ జి.వరప్రసాద్, వీఆర్వో సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గవర్నర్‌పేట రెవెన్యూభవన్‌లో అత్యవసర సమావేశంలో చర్చించుకుంటున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు

ఆప్కాస్ కంటే మెరుగైన విధానం తీసుకురండి

- ప్రభుత్వాన్ని కోరిన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

వన్‌టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): 'ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తున్న ప్రభుత్వం దానికంటే మెరుగైన విధానాన్ని తీసుకురావాలి. కూటమి ప్రభుత్వంపై మేము పెట్టుకున్న ఆశలను పాలనాదక్షుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వమ్ముచేయరని నమ్ముతున్నాం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తారని భావిస్తున్నాం. మమ్మల్ని ఆయా శాఖలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.' అని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ఆప్కాస్‌ను ఎత్తివేయడానికి నిర్ణయం తీసుకోవడంతో గవర్నర్‌పేటలోని రెవెన్యూభవన్‌లో శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం అత్యవసరంగా సమావేశమైంది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, అసోసియేట్ అధ్యక్షుడు జి.సంపత్‌కుమార్, కోశాధికారి రమణమూర్తి తదితరులు మంత్రివర్గ నిర్ణయాలపై చర్చించారు. సెర్ప్, మెప్మా ఉద్యోగులకు కల్పిస్తున్నట్లుగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ హెచ్ఆర్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

ప్రజాప్రతినిధి నోటి దురుసుతనం

- సెలవుపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్

విజయవాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఓ ప్రజాప్రతినిధి నోటి దురుసుతనంతో మనస్థాపానికి గురైన నగరంలోని కొత్తపేట ఇన్‌స్పెక్టర్ చిన్న కొండలరావు సెలవులో వెళ్లిపోయారు. ఇన్‌స్పెక్టర్ కొండలరావు ఒక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొద్దిరోజుల క్రితం నమోదు చేశారు. ఇందులో ఒక పార్టీ కృష్ణాజిల్లాకు చెందిన కూటమి ఎమ్మెల్యే వద్దకు వెళ్లారు. ఆయన ఫోన్ చేసి ఇన్‌స్పెక్టర్‌ను ఇష్టానుసారంగా దూషించారు. ఇన్‌స్పెక్టర్ కేసు వివరాలు చెబుతున్నా వినకుండా తన స్టైల్‌లో మాటలు తూలారు. దీనికి మనస్థాపం చెందిన కొండలరావు శుక్రవారం ఉదయం తన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఉంచేసి ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశారు. అనంతరం సెలవులో వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ విషయం కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారింది. ఆ విధంగా మాట్లాడిన ఎమ్మెల్యే ఎవరన్న దానిపై చర్చ నడుస్తోంది.

గ్రూప్-2 రాత పరీక్షపై స్పష్టత ఇవ్వాలి

- ఏపీపీఎస్సీని కోరిన నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్

వన్‌టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 అభ్యర్థులకు ఈ నెల 23న జరగాల్సిన రాత పరీక్ష ఉంటుందా..వాయిదా పడుతుందా అనేది స్పష్టత ఇవ్వాలని ఏపీపీఎస్సీ చైర్మన్‌ను ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 899 గ్రూప్ -2 ఉద్యోగాలకు కిందటేడాది ఫిబ్రవరి 25న ప్రాథమిక పరీక్ష జరిగిందని, ప్రధాన పరీక్షకు 92,259 మంది ఎంపికయ్యారని, ఈనెల 23న ప్రధాన పరీక్ష జరుగుతుందని తెలిపారని పేర్కొన్నారు. కోర్టు కేసులు, తదితర సమస్యల కారణంగా పరీక్షలు షెడ్యూలు మేరకు జరగవని, పరీక్ష రద్దవుతుందని ప్రచారం జరుగుతోందని, దీనిపై ఏపీపీఎస్సీ చైర్మన్ స్పష్టత ఇచ్చి సందేహాలను నివృత్తి చేయాలని ఆయన కోరారు. ఈ పోస్టుల ప్రకటన కోసం గత ప్రభుత్వ హయాంలో పడిన ఇబ్బందులను లేఖలో ప్రస్తావించారు.

భూ రగడ

(5వ పేజీ తరువాయి)

అటవీ శాఖ అధికారుల తీరుపై గ్రామస్తులు మంత్రి కొల్లు రవీంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి ఈ భూమి పరిస్థితిపై వివరాలు సేకరించారు. గతంలో ఈ భూములను అటవీశాఖ తన ఆధీనంలోకి తీసుకోలేదని, మడచెట్లు పెంచిన దాఖలాలు కూడా లేవన్నారు. ఈ భూముల పక్కనే స్థానికంగా నివాసం ఉండే మత్స్యకారులకు లేదా ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన సొసైటీల ద్వారా సరుగుడు చెట్లు పెంచుతున్నారని వివరించారు. ప్రస్తుతం అటవీశాఖ అధికారులు చదును చేస్తున్న భూముల్లో కొంత భూమిని పేదలకు అసైన్డ్ పట్టాలుగా కూడా ఇచ్చారని తెలిపారు. పూర్తిస్థాయిలో పరిశీలించే వరకు వివాదం లేకుండా చూడాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు.



ఎంఎన్‌కే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద కుంగిన ఏడుఖానాల బ్రిడ్జి

తిరువూరు నియోజకవర్గంలో బ్రిడ్జిలు, పలు రహదారులు మరమ్మతులు, నిర్మాణాలకు నోచుకోకపోవడంతో రాకపోకలకు ప్రజలు నానా ఇబ్బంది పడుతున్నారు. 2018లో కట్టలేరుపై వినగడప వద్ద బ్రిడ్జి కూలిపోయింది. ఇప్పటి వరకు దాని నిర్మాణం జరగలేదు. ఇటీవల వరదలకు ఎంఎన్‌కే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద ఏడు ఖానాల బ్రిడ్జి కుంగిపోయింది. ఈ రెండు బ్రిడ్జిల వద్ద అప్రోచ్ రోడ్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిల వంతెనలు

2018లో కట్టలేరుపై వినగడప వద్ద కూలిన బ్రిడ్జి

- ఇటీవల వరదలకు ఎంఎన్‌కే రోడ్డులో కుమ్మరికుంట్ల వద్ద కుంగిన ఏడు ఖానాల బ్రిడ్జి
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- కొత్త బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి-తిరువూరు): నియోజకవర్గంలో పలు రహదారులు, బ్రిడ్జిలు మరమ్మతులు, నిర్మాణాలకు నోచుకోకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎంఎన్‌కే(మచిలీపట్నం, నూజివీడు, కల్లూరు) రోడ్డులో విస్సన్నపేట నుంచి ఎ.కొండూరు అడ్డరోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిలో కుమ్మరికుంట్ల వద్ద వరదనీరు, ఎ.కొండూరు చెరువు అలుగునీరు ప్రవహించే కాల్వపై చాన్నాళ్ల క్రితం తూములతో నిర్మించిన ఏడుఖానాల చిన్నబ్రిడ్జి ఇటీవల వచ్చిన వరదలకు దెబ్బతింది. ఈ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. దీంతో ఈ బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా అప్రోచ్‌రోడ్డు నిర్మించి రాకపోకలు సాగిస్తున్నారు. అప్రోచ్ రోడ్డు కూడా సరిగా లేదు. దీంతో ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తిరువూరు నుంచి మధిర ప్రధాన రహదారి, ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి విస్సన్నపేట రహదారి, అక్కపాలెం, కోకిలంపాడు, వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ధ్వంసమైన బ్రిడ్జిల స్థానంలో నూతన బ్రిడ్జిలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కట్టలేరు..ఆ కథ వేరు!

తిరువూరు ప్రాంతం నుంచి ప్రవహించే కట్టలేరు, విప్లవవాగు, వెదుళ్లవాగు, పడమటివాగు, గుర్రపువాగులు గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరులో కలుస్తాయి. 2018 ఆగస్టు 28న తుఫానుకు వినగడపవద్ద కట్టలేరుపై గతంలో నిర్మించిన బ్రిడ్జి ధ్వంసమయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.13 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. టెండర్ల దశలో 2019 సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో బ్రిడ్జి నిర్మాణం జరగలేదు. గత ఏడాది మార్చి 19న తిరువూరు వచ్చిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వినగడప వద్ద కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లు ప్రకటించారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు అప్పటి ఎంపీ కేశినేని నాని, నలగట్ల స్వామిదాసుతో కలిసి వినగడప వద్ద కట్టలేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలవకుండా స్టేట్ ప్లాన్‌గ్రాంటు రూ.25.60 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అప్పటి ఎమ్మెల్యే కె.రక్షణనిధి కార్యక్రమానికి హాజరుకాలేదు.



ఎన్నికలకు ముందు టెండర్ పిలవకుండానే వైసీపీ నాయకులు హడావుడిగా వేసిన శిలాఫలకం

తాత్కాలిక రోడ్డుపై తిప్పలు

వినగడప వద్ద కట్టలేరుపై బ్రిడ్జి కూలడంతో గంపలగూడెం మండలం తోట మూల నుంచి విజయవాడ, నూజివీడు, కనుమూరు, అనుముల్లంక, కొత్తపల్లి, తెలంగాణ ప్రాంతంలోని పుణ్యక్షేత్రమైన జమలాపురంతోపాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కూలిన బ్రిడ్జి ప్రాంతంలో తాత్కాలిక రోడ్డు ఏర్పాటుచేశారు. అది కొద్దిపాటి వరదలకే కొట్టుకుపోతోంది. తిరిగి రోడ్డు నిర్మించడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుపై వివిధ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

ముగిసిన సుబ్బారాయుడి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు స్వామి పవళింపు సేవతో ముగిశాయి. మాఘ శుద్ధ చవితి ఆదివారం స్వామిని పెండ్లి కుమారుడిని చేయడంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభమై మాఘశుద్ధ నవమి గురువారం రాత్రి పవళింపు సేవతో ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ద్వాదశ ప్రదక్షిణల కార్యక్రమాన్ని అర్చక బృందం శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు బుద్ధు పవన్ కుమార్‌శర్మ, వేద పండితులు శాస్త్రోక్తంగా పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష అలంకరణ చేసిన స్వామి, అమ్మవార్లకు కల్యాణ మండపంలో పవళింపు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

టీడీపీ నాయకుడిపై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న పసుపులేటి సూర్యప్రకాష్

నందిగామరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పసుపులేటి సూర్యప్రకాష్‌పై హత్యాయత్నం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం లింగాలపాడు గ్రామం నుంచి బైక్‌పై నందిగామ వస్తుండగా మధ్యలో గ్రామస్థులు కనిపించారు. వారితో మాట్లాడుతుండగా మరో బైక్‌పై వచ్చిన అదే గ్రామానికి చెందిన కొంగర రామకృష్ణ ఢీకొట్టాడు. సూర్యప్రకాష్ కిందపడిపోయాడు. వెంటనే రామకృష్ణ కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో సూర్యప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాగితాల దండలు, ఉంగరాలు మార్చుకుని..

హైనీ హైస్కూల్‌లో మైనర్ల వివాహం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాగితాల దండలు, కాగితాల ఉంగరాలు మార్చుకుని హైనీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలుడు, బాలికను వివాహం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం రెండవ సెషన్‌లో పాఠశాల తరగతి గదిలోనే విద్యార్థులు కాగితపు ఉంగరాలు మార్చుకుని, మెడలో కాగితపు దండలు వేసుకున్నారు. అక్కడ ఉన్న విద్యార్థులందరితో మేము పెళ్లి చేసుకుంటున్నాం. మీరు ఆశీర్వదించండంటూ కేకలుపెట్టారు. విద్యార్థి బాలుర హాస్టల్‌లో, విద్యార్థిని బాలికల హాస్టల్‌లో చదువుతున్నారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు వారి బంధువులను పిలిపించారు. దీనిపై ఉపాధ్యాయులను, కరస్పాండెంట్‌ను వివరణ అడగ్గా నిరాకరించారు. సున్నితమైన వ్యవహారమని, విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేలా చూస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు.

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై

చర్యలు తీసుకోండి

- ఆయన నన్ను ఇబ్బంది పెడుతున్నారు
- నాపై తప్పుడు కేసు పెట్టించారు
- అందుకే ఆత్మహత్యకు యత్నించా
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు సెల్ఫీ వీడియోలో డేవిడ్ విజ్ఞప్తి



సెల్ఫీ వీడియో ద్వారా తన ఆత్మహత్యాయత్నానికి కారణాలు వివరిస్తున్న డేవిడ్

తిరువూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తిరువూరు నియోజకవర్గంలో టీడీపీని కాపాడుకునేందుకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని, తనలాంటి కార్యకర్తల్ని ఆదుకోవాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన పల్లికంటి డేవిడ్ విజ్ఞప్తి చేశాడు. గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన డేవిడ్ ప్రస్తుతం విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన సెల్ఫీవీడియో శుక్రవారం విడుదలైంది. 'పేద కుటుంబానికి చెందిన నేను టీడీపీ కోసం పనిచేశా. కొన్ని రోజులుగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నన్ను ఇబ్బంది పెడుతున్నారు. పార్టీకి చెందిన కొందరు పెద్దలపై తప్పుడు పోస్టింగులు పెట్టాలని, ఆ నాయకులపై భౌతికదాడులు చేయాలని నాపై ఒత్తిడి తెస్తున్నారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతో నాపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు ఏదైనా చేస్తారనే భయంతో ఆత్మహత్యకు యత్నించా.' అని డేవిడ్ పేర్కొన్నాడు. తనది పేదకుటుంబమని అయినా పార్టీకోసం పనిచేస్తున్నామని, ఎమ్మెల్యే మాత్రం తమ గ్రామంలో వైసీపీ వారితో కలిసి తనను ఇబ్బంది పెడుతున్నాడని, తనపై తప్పుడు కేసులు పెట్టించారని సెల్ఫీ వీడియోలో వాపోయాడు.

చిన్నారులపై కర్కశం

ఆశోక్‌నగర్‌లోని ఓ స్కూల్‌లో తమ పిల్లలను చిత్రహింసలు పెడుతున్నారని తల్లిదండ్రుల ఆందోళన



ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పటమట పోలీసులు

ఆటోనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని వయసు వారిది. ఆకలేస్తే ఏడవడమే తప్ప ఆకలేస్తుందని అడగాలని తెలియదు వారికి..అలాంటి పసిపిల్లల్ని 12వ డివిజన్ ఆశోక్‌నగర్‌లోని శ్రీ ఆచార్య ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి, ఇతర సిబ్బంది చిత్రహింసలు పెడుతున్నారంటూ శుక్రవారం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తమ పిల్లల్ని చిత్రహింసలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పాఠశాల ముందు బైఠాయించారు. సమాచారం అందుకున్న పటమట పోలీసులు పాఠశాల వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. పోలీసులు రావడంతో పాఠశాలలోని సిబ్బంది అక్కడి నుంచి పరారయ్యారు. ప్రిన్సిపాల్ స్వాతి స్పృహ తప్పినట్టు పడిపోయి దగ్గరలోని ఆస్పత్రిలో చేరారు. పాఠశాల యజమాని కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వాలని ఎస్సై సూచించి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

ఓ విద్యార్థి తల్లి ఆవేదన..

'వారం క్రితం నా కుమారుడి తొడ భాగంలో ఎర్రగా కందిపోయి ఉండడాన్ని గమనించాను. సూదులతో గుచ్చినట్లు కనిపించడంతో ఆ చిన్నారిని అడిగాను. ఎంత అడిగినా ఏం జరిగిందో చెప్పకపోవడంతో మందులు వాడాను. రెండు రోజుల తర్వాత మరో తొడ కాలికి గాయాలు కనిపించాయి. అప్పుడు అడిగితే స్కూల్లో గిచ్చినట్లు చెప్పాడు. దీంతో పాఠశాలకు వెళ్లి సీసీ కెమెరాలు చూపించాలని గట్టిగా అడిగాను. ప్రిన్సిపాల్ స్వాతి, ఇతర సిబ్బంది కలిసి చిన్నారులను రోజూ చిత్రహింసలు పెడుతున్నట్టు తెలిసింది. ఆ వీడియోలను ఇతర తల్లిదండ్రులకు పంపాను.' అని విద్యార్థి తల్లి తెలిపారు.


సీసీ ఫుటేజీ డిలీట్ చేశారు

తామంతా కలిసి పాఠశాల యజమాని కార్తీక్‌ను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. సీసీ ఫుటేజీని కార్తీక్ డిలీట్ చేసినట్లు వారు గుర్తించారు. తన భార్యను(ప్రిన్సిపాల్ స్వాతిని) కాపాడుకోవాలనే కాపాడుకోవాలనే ఈ పనిచేశారని ఆరోపిస్తున్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుడి దండన

- వాటర్ పైపుతో కొట్టడంతో వీపుపై తేలిన వాతలు

నాగాయలంక, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్రచివర పంచాయతీ శివారు పెదగౌడపాలెం మండల పరిషత్ యూపీ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పరిశే రూపేష్‌ను ఉపాధ్యాయుడు బండ్రెడ్డి హనుమాన్ శుక్రవారం దండించాడు. రూపేష్‌కు పాఠం రాకపోవడంతో ఆగ్రహించిన ఉపాధ్యాయుడు వాటర్ పైపుతో విద్యార్థి వీపు భాగంలో కొట్టారు. దీంతో వీపుపై ఉబ్బి, వాతలు తేలాయి. ఈ ఉదంతం సోషల్ మీడియాలో వైరల్ అవడంతో ఎంఈవో టి.వి.ఎం.రామదాసు పెదగౌడపాలెం పాఠశాలకు వెళ్లారు. విద్యార్థిని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయుడిని విచారించానని, జిల్లా అధికారులకు నివేదిక పంపుతానని ఎంఈవో తెలిపారు.



విద్యార్థి వీపుపై తేలిన వాతలు

నేటి నుంచి సిద్ధేంద్ర యోగి

జయంత్యుత్సవాలు

కూచిపూడి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యంలో కూచిపూడి సిద్ధేంద్ర యోగి నాట్య కళావేదికపై శనివారం నుంచి రెండు రోజులపాటు సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళామండలి కార్యదర్శి పసుమర్తి మృత్యుంజయశర్మ తెలిపారు. శని, ఆదివారాల్లో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలిరోజైన శనివారం అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి విద్యార్థులతో కూచిపూడి నాట్య ప్రదర్శన, అనంతరం విశాఖపట్నానికి చెందిన నాట్య సన్నిధాలయం విద్యార్థులతో కూచిపూడి నాట్యం, కూచిపూడి సంప్రదాయ భామాకలాప నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముగింపు రోజైన ఆదివారం నాద పద్మ, నందిపల్లి సాహితీల సోలో అభినయం, అనంతరం గోనుగుంట శైలశ్రీ బృందం, శ్రీ లలితా స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులతో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు మృత్యుంజయశర్మ తెలిపారు.

యూపీ నుంచి ఏపీ

(5వ పేజీ తరువాయి)

రెక్కీ నిర్వహించారు. ఇక్కడ చోరీకి స్కెచ్ వేసుకుని తిరిగి విజయవాడ నుంచి ఏలూరు వైపునకు వెళ్లిపోయారు.

ఇలా దొంగతనం చేశారు.. : ఈనెల ఐదో తేదీన ఏలూరు వైపు నుంచి నగరంలోకి ప్రవేశించారు. అర్ధరాత్రి 1-2 గంటల మధ్య గోడౌన్‌లో ఐఫోన్లు, ట్యాబ్‌లు, యూఎస్‌బీ కేబుల్, యాక్సరీస్, ఐప్యాడ్‌లు, లెనోవో ట్యాబ్‌లు కాజేశారు. ఆ తర్వాత వచ్చిన మార్గంలోనే వెళ్లిపోయారు.

పోలీసులు దొరికిపోయారు..: గోడౌన్ ఇన్‌చార్జి ఫరూక్ అహ్మద్ ఫిర్యాదును తీసుకున్న తర్వాత క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, డీసీపీ గౌతమీషాలి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఇన్‌స్పెక్టర్లు వి.పవన్‌కిషోర్, రామ్‌కుమార్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోడౌన్ నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను గురువారం తెల్లవారుజాము వరకు పరిశీలించారు. ఒక బృందం ప్రైవేట్ సీసీ కెమెరాల ఫుటేజీలను, ఒక బృందం ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్‌లో నుంచి ఫుటేజీలను పరిశీలించింది. టోల్‌ప్లాజాల వద్ద మరో బృందం సీసీ కెమెరాలను పరిశీలించింది. సుమారు 100కు పైగా సీసీ కెమెరాలను పరిశీలించి పోలీసులు నిందితులను గుర్తించారు. రాష్ట్రంలోకి ఏ మార్గంలో ప్రవేశించారో అదే మార్గంలో దాటేస్తున్నట్టు పోలీసులు భావించారు. పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఈ సమాచారాన్ని డీజీపీకి చేరవేశారు. నిందితులు బిహార్ వైపునకు పారిపోతున్నట్టుగా గుర్తించి సీపీ ఆ రాష్ట్ర పోలీసులతో సంప్రదించారు. నిందితులు ఉపయోగించిన కారు, వారి ఫొటోలను అక్కడి పోలీసులకు పంపారు. బిహార్ రాష్ట్రంలోకి ప్రవేశించే మార్గంలో ఉన్న జాతీయ రహదారిపై అక్కడి పోలీసులు యూపీ గ్యాంగ్‌ను పట్టుకున్నట్టు తెలిసింది.

శవ పంచాయితీ

(5వ పేజీ తరువాయి)

రాకపోవడంతో మృతదేహాన్ని మున్సిపాలిటీకి అప్పగించవచ్చని మాచవరం పోలీసులు నిరభ్యంతర ధ్రువీకరణపత్రం ఇచ్చారు. ఆసుపత్రి అధికారులు అనాథ శవాల్లో కొన్నింటిని మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగిస్తారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న వైద్య కళాశాలలు వైద్య విద్యార్థులకు శరీరంలో భాగాలను చూపించి బోధన చేయడానికి ఇవ్వాలని ప్రభుత్వాసుపత్రులకు లేఖలు రాస్తాయి. వాటిని ఆసుపత్రి అధికారులు ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తుంటారు. ఈవిధంగా శ్యామ్‌సన్ మృతదేహాన్ని తమిళనాడులోని ధనలక్ష్మి వైద్య కళాశాలకు విజయవాడ ప్రభుత్వాసుపత్రి అధికారులు నవంబరు 10వ తేదీన అప్పగించారు.

జనవరిలో డెత్ సర్టిఫికెట్

శ్యాంసన్‌ను ఆసుపత్రిలో చేర్పించిన కార్మికుడు జనవరిలో ఆయన కుటుంబ సభ్యులకు కనిపించాడు. ఆ సమయంలో ఆయన ఆచూకీ గురించి అడిగారు. రోడ్డుపై పడిపోయి ఉంటే ఆసుపత్రిలో చేర్పించానని చెప్పాడు. దీంతో వారు జనవరి 18వ తేదీన ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి సిబ్బంది ఫొటో చూపించి విచారించారు. దాన్ని చూపిన సిబ్బంది శ్యామ్‌సన్ చనిపోయాడని చెప్పారు. తర్వాత వారు ఆసుపత్రి అధికారులను ఆయన మరణ ధ్రువీకరణపత్రం ఇవ్వాలని అడిగారు. అధికారులు రికార్డులను పరిశీలించి శ్యామ్‌సన్ మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చారు. దాన్ని తీసుకుని వెళ్లిపోయిన కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. శ్యాంసన్ మృతదేహాన్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నష్టపరిహారం చెల్లించాలని పట్టుబట్టారు. తాము నిబంధనల ప్రకారమే మృతదేహాన్ని వైద్య కళాశాలకు ఇచ్చామని ఆసుపత్రి అధికారులు వారికి వివరించారు. కాసేపు ఆసుపత్రిలో నానా హడావిడి చేశారు. పోలీసులు, ఆసుపత్రి అధికారులు పరిస్థితిని వివరించడంతో శాంతించి ఇంటికి వెళ్లిపోయారు. కాగా, శ్యాంసన్ డెడ్‌బాడీని అప్పగించినప్పుడు సదరు వైద్య కళాశాల వారు రూ.లక్ష చెక్కు ఇవ్వగా, దానిని సిబ్బంది ఆసుపత్రి డెవలప్‌మెంట్ ఫండ్‌లో జమ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

ఘనంగా అభిషేకం

హనుమాన్‌జంక్షన్ : స్థానిక బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం కుబేర పాశుపత అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి అరుణ్ కుమార్ అభిషేకం జరిపారు.

రోడ్డుపైనే వాహనాలు!

- సినిమాహాల్ సెంటర్ ఏరియాలో స్తంభిస్తున్న ట్రాఫిక్
- పట్టించుకోని పోలీసులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

(కంకిపాడు ఆంధ్రజ్యోతి)

కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వాహనాలు రోడ్డుపై నిలపడంతో ట్రాఫిక్ నిలిచి పోతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు సినిమాహాల్, టిఫిన్ సెంటర్లు, దస్తావేజు లేఖర్ల కార్యాలయాలు, కూల్ డ్రింక్ షాపులు ఇలా పలు రకాల వ్యాపారాలకు ప్రధాన కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు వచ్చే క్రియ, విక్రయాలు జరిపేవారితో రద్దీ మరింతగా ఉంటుంది. రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు తమ వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. తమ పనులు ముగించుకొని ఎప్పటికోవస్తున్నారు. ఈ లోగా రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యతో



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాల కారణంగా స్తంభించిన ట్రాఫిక్

ప్రజలు సతమత మవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రిజస్ట్రార్‌కు సంబంధించిన సిబ్బంది వాహనాలను రోడ్డుపై నిలపకుండా చూడటంలో విఫలమవుతున్నారు. దీనికి తోడు దస్తావేజు లేఖర్లు క్రయ విక్రయదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించటంలో మిన్న కుంటున్నారు. ఇక ట్రాఫిక్ పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంతో సమస్య నిత్యం వేధిస్తుంది. ఇప్పటికైనా రద్దీగా ఉండే ప్రాంతంలో వాహనాలు రోడ్డుకు అడ్డుగా నిలిపే వాహనదారులను నిలువరించాల్సిన బాధ్యత పోలీసులతో పాటు ఆ చుట్టుపక్కల వ్యాపారులపైనా కూడా ఉంది. ప్రధాన రహదారులకు ఇరువైపులా వాహనాలు నిలపకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

అపరాల్లో తెగుళ్ల నివారణపై శ్రద్ధ వహించాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అపరాల సాగులో రైతులు ఎదుర్కొంటున్న తెగుళ్ల నివారణపై తగిన శ్రద్ధ వహించాలని బాపులపాడు వ్యవసాయాధికారి జె.భవాని రైతులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాకులపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము పైరులో మచ్చ తెగుళ్లను గమనించారు. అపరాల సాగులో తెగుళ్ల నివారణకు తీసుకో వాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు అట్లూరి సత్యనారాయణ, పొట్లూరి జగన్‌మోహన్‌రావు, సూరపనేని ఆనంద బాబు, అట్లూరి వెంకయ్య పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

కంకిపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావును గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు పంచకర్ల రంగారావు అన్నారు. కంకిపాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొనే అనేక సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చట్టసభల్లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తాడంకి నరేష్, చిక్కవరపు శ్రీహరి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెదఓగిరాల వాకర్స్ అసోసియేషన్ ప్రారంభం

ఉయ్యూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అసోసియేషన్ ద్వారా సేవా కార్య క్రమాలు చేపట్టి పేరు ప్రఖ్యాతులు గడించాలని వాకర్స్ అసోసియేషన్ జిల్లా 204 గవర్నర్ సనకా సుబ్బారావు అన్నారు. పెదఓగిరాలలో వాకర్స్ అసోసియేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సహకారంతో పెదఓగిరాల వాకర్స్ అసోసి యేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. సేవా కార్యక్రమాల్లో ఉయ్యూరు అసోసియేషన్ ముందంజలో ఉందన్నారు. జిల్లా డిప్యూటీ గవర్నర్ శివరామ కృష్ణ, వీరశేఖర్, వైద్య విజ్ఞాన ఛైర్మన్ సంగం తిరుమలరావు, జిల్లా ఛైర్‌పర్సన్ ఎన్ రాం బాబు, పొగిరి రాము, కోడె సాంబశివరావు, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : 33/11కేవీ ఉంగుటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జి.బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉంగుటూరు, ఆముదాలపల్లి, ఎలుకపాడు, లంకపల్లి, గారపాడు, కొయ్యగూరపాడు, పొణుకుమాడు, నాగవరప్పాడు, తుట్టగుంట, వెన్నూతల, వెల్దిపాడు, వేంపాడు, తరిగొప్పల గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

భవ్యరామాలయానికి విరాళాల వెల్లువ

పెనమలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోరంకిలో నిర్మించిన నూతన భవ్యరామాలయానికి శుక్రవారం కూడా విరాళాలు వెల్లువెత్తాయి. భక్తులు విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, అన్న సమారాధన కార్యక్రమాలకు విరివిగా విరాళాలను ఇస్తున్నారు. శుక్రవారం పోరంకికి చెందిన జొన్నలగడ్డ వెంకటఅప్పారావు 5,01,116 రూపాయలను, ఉషోదయా స్కూల్ ఫౌండర్ యార్లగడ్డ పరమేశ్వరరావులో రూపాయలు, కోపూరు వెంకట సీతారాంబాబు లక్ష రూపాయలు, తోటకూర నాగయ్య, చిగురుపాటి సీతారామయ్యల జ్ఞాపకార్థం చిగురుపాటి నాగార్జున లక్ష రూపాయలను కోదరండ రామాలయ కమిటీ సభ్యులకు అందించారు.



విశ్వశాంతి ఆవరణలో డెయిరీ ప్రారంభిస్తున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి దామోదర్ నాయుడు, విజయ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

పశుపోషణపై శ్రద్ధ అభినందనీయం

రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ టి దామోదర్ నాయుడు

ఉయ్యూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా విద్యాసంస్థల నిర్వహణతో పాటు శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రమణ్యేశ్వరరావు పశువులపై ప్రేమతో పశుపోషణ సంమర్థవంతంగా చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ టి దామోదర్ నాయుడు ప్రశంసించారు. విద్యాసంస్థల ఆవరణలో నూతనంగా ముర్రా జాతి గేదెల డెయిరీ ఫామ్ ఏర్పాటును కృష్ణామిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని అంజనేయులతో కలసి శుక్రవారం ప్రారంభించారు. డెయిరీ ఫామ్ నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ విశేష కృషి చేస్తుందని యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. డీహెచ్‌వో చిననరసింహులు, డీడీ గోపీ చంద్, ఏడీ రామశేఖర్, వాస్తు విశారద కోడె మల్లికార్జునరావు, కె ఈశ్వరబాబు హాజరయ్యారు. డెయిరీ విశేషాలను మాదల సుబ్రమణ్యేశ్వరరావు, మాదల సూర్యశేఖర్, సుష్మ తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో 17 మందికి ఉద్యోగాలు

ప్రసాదంపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 17 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులు 150 మంది ఈ డ్రైవ్‌కు హాజరయ్యారన్నారు. వీరిలో 17 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి ఏడాదికి రూ.3.60 లక్షల వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, అధ్యాపకుల బృందం అభినందనలు తెలిపారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు

ముగిసిన వీఆర్ సిద్ధార్థ హ్యాకథాన్-2025

పెనమలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వీఆర్ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబి యూనివర్సిటీ నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి ఆటోనమస్ హ్యాకథాన్2025 ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా పాల్గొన్న విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ఎనిమిది థీమ్స్‌లో ఏఐ ఆధారిత వినూత్న ప్రాజెక్టులను అభివృద్ధి చేసి చూపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఏపీఎస్‌సీహెచ్ఈ ఛైర్మన్ కొర మధుమూర్తి, గౌరవ అతిథి రామచంద్రన్ ప్రేబగర్, ప్రముఖ అతిథి ఏవీ సుబ్రహ్మణ్యంలు విద్యార్థుల ప్రతిభను అభినందించారు. హ్యాకథాన్ విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వీసీ పీ వెంకటేశ్వరరావు, ప్రోవీసీ ఏవీ రత్నప్రసాద్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న యాజమాన్యం

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గన్నవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ తగిన ప్రాధాన్యతనిచ్చి రాణించాలని ఆంధ్ర ఖోఖో సంఘం వ్యవస్థాపక కార్యదర్శి టిఎస్ఆర్‌కె ప్రసాద్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సెంట్రల్ జోన్ క్రీడల్లో సత్తా చాటి బంగారు, కాంస్య, వ్యక్తిగత పతకాలు సాధించి మెమెంటోలు అందుకున్నారు. విజేతలను శుక్రవారం జడ్పీటీసీ సభ్యురాలు ఏఈ రాణితో కలసి అభినందించారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్‌కె ప్రసాద్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో సాధన చేసి భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని సూచించారు. క్రీడా రంగానికి తమవంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. పీడీలు మీరా సాహెబ్, డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాల తనిఖీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ ఎరువులు, పురుగుమందులు విక్రయించే దుకాణదారులను హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగుమందులు విక్రయించే దుకాణదారులు బిల్లులు ఇవ్వటంలేదని రైతులనుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో శుక్రవారం ఏవో ఉంగు టూరు, ఆముదాలపల్లి గ్రామాల్లోని పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీచేశారు ఈ కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

ఉంగుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం బాగోలేదంటూ తరచుగా పాఠశాలకు వెళ్లని కూతురిని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన కూతురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆత్కూరులో జరిగింది. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొల్లకట్లు సన్నుతి(15)అనే విద్యార్థిని స్థానిక జడ్పీహైస్కూల్‌లో పదవతరగతి చదువుతోంది. ఆరోగ్యం బాగోలేదనే కారణంతో తరచుగా పాఠశాలకు సెలవుపెడుతున్న కూతుర్ని గురువారం ఉదయం తల్లి మందలించి ఇంటి బయట పనుల్లో నిమగ్నమైంది. దీంతో మనస్తాపం చెందిన సన్నుతి ఇంట్లో వెండివస్తువులు శుభ్రం చేసుకునేందుకు తెచ్చిన లిక్విడ్ యాసిడ్‌ను తాగింది. గమనించిన తల్లి వెంటనే గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా వుండటంతో మెరుగైన వైద్యంకోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఏఎస్సై ఆర్.రామారావు అనుమానాస్పద మృతికింద కేసు నమోదుచేశారు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు. ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక బైపాస్ రోడ్డు సమీపాన నూతనంగా నిర్మించిన ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉయ్యూరు తాలూక యూనిట్ సజ్జా రామారావు ఎన్జీజీఓ భవనాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌తో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉయ్యూరులో ఎన్జీజీవోస్ హోమ్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి మాట్లాడుతూ, కష్టపడి పనిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లపై పెట్టిన కేసులు ఉపసం హరించేందుకు ప్రభుత్వం అంగీకరించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నామని విద్యాసాగర్ అన్నారు. ఎన్జీజీవోస్ హోమ్‌కు అవసరమైన స్థలం విరాళంగా ఇచ్చిన సజ్జా వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ పశ్చిమ కృష్ణాజిల్లా సహాధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఉయ్యూరు అసోసి యేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మీగడ శ్రీనివాసరావు, కోశాధి కారి ఏటుకూరి శ్రీకృష్ణ, శ్రీదేవి, స్థల దాత సజ్జా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, శివారెడ్డి, విద్యాసాగర్

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

గన్నవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధి పూర్తి స్థాయిలో జరగాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని టీడీపీ గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం పోలింగ్ బూత్ ఇన్‌చార్జీల కూటమి ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పర్యవేక్షకులు కోట వీరబాబు రాష్ట్ర టీడీపీ కార్య నిర్వహక కార్యదర్శి చిరుమామిళ్ళ సూర్యం, జనసేన నాయకులు చిమట రవివర్మ, బీజేపీ నాయకురాలు శేష మాధవి, కృష్ణాజిల్లా అంగన్వాడీ, డ్వాక్రా విభాగం అధ్యక్షురాలు పొదిలి లలిత, తెలుగు మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ తదితరులు ప్రసంగించి ఆలపాటి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.



ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న వడ్రాణం హరిబాబు నాయుడు

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

గన్నవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఆత్కూరు ఎస్సై సురేష్ అన్నారు. మండలంలోని వీరపనేనిగూడెం జడ్పీహైస్కూల్‌లో శుక్రవారం మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ, వ్యక్తి ఉన్నతికి ప్రతి బంధకాలైన మత్తు పదార్థాల జోలికి పోకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే జీవితంలో కోరుకున్న లక్ష్యానికి చేరువ కావచ్చన్నారు. స్నేహితులు ఒత్తిడి చేశారనో, అందరు చేస్తున్నదే కదా అని తేలిగ్గా తీసుకుని మత్తు పదార్థాలను సేవిస్తూ కూర్చుంటే వ్యసనంగా మారి వాటికి బానిసలవుతారని వివరించారు. అన్నింటిలో పోటీ పెరిగిన నేటి సమాజంలో లక్ష్యాల వైపు కాకుండా మత్తు పదార్థాల బాట పడితే జీవితం అంధకారం అవుతుందన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం టి.శివకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆత్కూరు ఎస్సై సురేష్

• ప్రేమ చిలుకలు





దొండ పండు లాంటి ముక్కుతో పచ్చని చిలుకలు రెండు గూట్లో గుసగుసలాడాయి. ఒకదానిపై మరొకటి ప్రేమను ఒలకపోస్తూ వయ్యారాలు పోయాయి. ఈ దృశ్యాలు విజయవాడ-అవనిగడ్డ కరకట్ట రోడ్డులో కనిపించాయి.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదు

» కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. మచిలీపట్నం అప్సర హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రిగా పనిచేస్తూ అకస్మాత్తుగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి చనిపోవడంతో వైఎస్ కుమారుడైన జగన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, అయితే అవినీతి ఊబిలో కూరుకుపోయిన ఆయన్ను రాష్ట్ర ప్రజలు తిరిగి అధికారంలో నుంచి దింపివేశారని చెప్పారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడానికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తాను చిత్తూరు జిల్లా వాడినని, చంద్రబాబు పాలన దక్షత తనకు తెలుసన్నారు. మహిళలు ఉచిత బస్సు కోసం, విద్యార్థులు తల్లికి వందనం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక జీవనది లాంటిదని, ఎందరో వస్తుంటారు, వెళుతుంటారన్నారు. ఉద్యోగాల్లో, రాజకీయ పదవుల్లో ఎస్సీలకు రిజర్వేషన్‌లు ఎలా కల్పిస్తున్నారో అదే విధంగా బ్యాంకు రుణాల్లో కూడా అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రుణాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కంటే తెలంగాణ ప్రభుత్వమే ఎక్కువ లబ్ధి పొందుతుందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాలన సంతృప్తికరంగానే ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వాస్తవాలను ప్రజలు తెలుసుకునే రోజులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

» జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



తిరునాళ్ల నిర్వహణపై మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

ఉయ్యూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరులో వీరమ్మ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. శనివారం నుంచి 15 రోజులపాటు జరగనున్న వీరమ్మ తిరునాళ్ల నేపథ్యంలో శుక్రవారం ఆయన ఉయ్యూరులో పర్యటించి ఏర్పాట్లు పరిశీలించారు. రావిచెట్టు సమీపంలోని ఆలయం వద్ద నుంచి తిరునాళ్లకు అమ్మవారు బయలుదేరే విధానం, ఆ సమయంలో భక్తులు ఎంతమంది వస్తారని ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకుని పలుసూచనలు చేశారు. ఆలయం వద్ద బారికేడ్లు, బందోబస్తు ఏర్పాట్లపై సీఐ రామారావుకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తిరునాళ్ల జరిగే ఆలయం, ప్రాంగణాన్ని పరిలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గన్నవరం డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై విశ్వనాథ్, రూరల్ ఎస్సై సురేశ్‌బాబు పాల్గొన్నారు.

తుపాకీ పేలి వ్యక్తి గాయపడిన కేసు కొట్టివేత

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బస్టాండ్‌లోని మరుగుదొడ్డిలో తుపాకీ పేలి వ్యక్తి గాయపడిన కేసును కృష్ణాజిల్లా ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.లక్ష్మి శుక్రవారం కొట్టివేశారు. వివరాల్లోకి వెళితే... ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన సుదర్శనం రవిదత్త అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన అపర్ణ అనే యువతిని ప్రేమించాడు. ఈ విషయం ఆమెకు చెప్పలేదు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు అనే వ్యక్తిని అపర్ణ వివాహం చేసుకుంది. తాను ప్రేమించిన యువతిని మరో వ్యక్తి వివాహం చేసుకోవడం తట్టుకోలేకపోయిన రవిదత్త ఇబ్రహీంపట్నానికి చెందిన చింతా సతీష్‌బాబు, డొక్కు పరమేష్, పీతా వెంకటేశ్వరరావుతో కలసి అపర్ణ భర్త శ్రీనివాసరావును చంపాలనుకున్నాడు. ఇందుకోసం తుపాకీ కొనుగోలు చేశాడు. 2014 మార్చి 11న తెల్లవారుజామున విజయవాడ బస్టాండులో టాయిలెట్‌కు వెళ్లిన సుదర్శనం రవిదత్త తన తుపాకీని కూడా వెంట తీసుకెళ్లాడు. అది అక్కడ మిస్‌ఫైర్ కావడంతో పక్క టాయిలెట్‌లో ఉన్న తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన నిమ్మల వీర వెంకట రమణకు బుల్లెట్ తగిలి రక్తస్రావం కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆయన కోలుకున్నాడు. అక్రమంగా ఆయుధం కలిగి ఉండటం, అది మిస్‌ఫైర్ అయ్యి ఒకరు గాయపడటంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 11 మంది సాక్షులను విచారించిన కృష్ణాజిల్లా ఎనిమిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.లక్ష్మి తగిన సాక్ష్యాలు లేక పోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుల పక్షాన న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, పేర్ని నాగపవన్‌కుమార్ వాదించారు.

పదవులు కాపాడుకోవటానికే జగన్‌తో భేటీ

» 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని

కార్పొరేషన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లు తమ పదవులు కాపాడుకోవడానికే జగన్ నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారని 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ విమర్శించారు. ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఒక గంట కూడా విజయవాడ అభివృద్ధిపై మేయర్, డిప్యూటీ మేయర్‌తో చర్చించలేదని, జగన్‌ను కలిసేందుకు కూడా కనీసం అవకాశం కల్పించలేదని పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో ఒక్కొక్క మున్సిపాలిటీ చేజారిపోవడంతో విజయవాడ పీఠం కాపాడుకోవడానికే జగన్ ఈ సమావేశం నిర్వహించారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి పనులను, సేవలను చూసి వైసీపీకి చెందిన ఎంతోమంది ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్‌లు కూటమి ప్రభుత్వంలో చేరేందుకు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు.

సీఆర్డీఏ భవనానికి జగన్ తెచ్చిన చిక్కులు

అమరావతిలో 2019లోనే తుది దశకు ఏడంతస్తుల బిల్డింగ్



సీఆర్డీఏ కార్యాలయం ముందు గుంతలు పూడ్చేందుకు తోలిన మట్టి

- అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ఆపేసిన జగన్
- మాస్టర్ ప్లాన్ మార్చి 2023లో అడ్డదిడ్డంగా నిర్మాణాలు
- ఇప్పుడు తలనొప్పిగా మారిన ఆనాటి చర్యలు
- అస్తవ్యస్త నిర్మాణాలను సరిదిద్దడమే పెద్ద సవాల్
- ఇప్పటికే 5 కోట్ల ఖర్చు, నాలుగు నెలల సమయం వృథా
- భవనం నిర్మాణం పూర్తికి మరో నాలుగు నెలలు పట్టే అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విధ్వంసాలు అన్నీఇన్నీ కావు. అమరావతిపై ఆయన సాగించిన కక్షాపూరిత రాజకీయాలు నీడలా వెంటాడుతూనే ఉన్నాయి. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్డీఏ) కార్యాలయం నిర్మాణంలో జాప్యానికి అధికారంలో ఉన్నపుడు ఆయన చేసిన చేష్టలే కారణం. రాజధాని నిర్మాణంలో సీఆర్డీఏది కీలకపాత్ర. నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి సంబంధించిన విధి, విధానాలన్నీ అక్కడే ప్రాణం పోసుకుంటాయి. అలాంటి సంస్థకు రాజధాని అమరావతిలో ఇప్పటికీ కార్యాలయం లేదు. 2014-19 కాలంలోనే సీఆర్డీఏ కార్యాలయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించినా ఇప్పటి వరకూ ఆ కార్యాలయం అందుబాటులోకి రాలేదు. నాడు జగన్ చేసిన విధ్వంసం కారణంగానే సీఆర్డీఏ కార్యాలయ భవన నిర్మాణం అంతకంతకూ జాప్యమవుతోంది.

భవన నిర్మాణ ప్లాన్‌కు తూట్లు

సీఆర్డీఏను 2014 డిసెంబరు 30న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన రావిపూడిలో 3.62 ఎకరాల్లో ఏడు అంతస్తులు, 2.42 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ భవనాన్ని నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. కార్యాలయం చుట్టూ 2.5 ఎకరాల్లో ఉద్యానవనం ఏర్పాటు చేయాలని భావించారు. 2017లో రూ. 160 కోట్ల అంచనాలతో పనులను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి భవనం ఏడంతస్తులు స్లాబ్ వరకూ పూర్తయ్యాయి. ఫినిషింగ్, ఇంటీరియర్, విద్యుత్ పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. మొత్తంగా 80 శాతం పూర్తయిన ఆ పనులను జగన్ సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే ఆపేశారు. ఆ తరువాత కొన్నాళ్లకు ఆర్బీఐ కార్యాలయం ఏర్పాటుకు ఈ భవనాన్ని సూచించగా, ఆర్బీఐ దానికి ఓకే చెప్పలేదు. అయినా జగన్ కుట్రలు ఆగలేదు. బీసీ కార్పొరేషన్లకు కావాల్సిన కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ఈ భవనాన్ని వాడుకోవాలని భావించారు. సీఆర్డీఏ కార్యాలయ భవన నమూనాను మార్చి 2023 కొత్త నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు ఆ నిర్మాణాలే తలనొప్పిగా మారాయి.

ప్లాన్‌ను సరిదిద్దలేక పాట్లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు భవనాల పరిస్థితిని తెలుసుకోవడానికి రాజధానిలో పర్యటించారు. గతేడాది అక్టోబరు 20న ఆయన సీఆర్డీఏ భవన నిర్మాణాల పనులను తిరిగి ప్రారంభించి రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అయితే ఆ పనులు ముందుకు సాగకపోవడానికి జగన్ పాలనలో నిర్మించిన అస్తవ్యస్త నిర్మాణాలే కారణం. ఇప్పుడు ఆ నిర్మాణాలను తొలగించి, మాస్టర్ ప్లాన్ ప్రకారం రూపొందించిన నమూనాను తీసుకురావడమే సవాలుగా మారింది. కార్యాలయం చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని శుభ్రం చేసి, అస్తవ్యస్త నిర్మాణాలను తొలగించడానికే నాలుగు నెలల సమయం పట్టింది.



నిర్మాణ సామగ్రి చేరవేస్తున్న కూలీలు

మరో నాలుగు నెలలు ఆగాల్సిందేనా?

రాజధానిలో సీఆర్డీఏ కార్యాలయం అందుబాటులోకి వస్తే నిర్మాణ పనులు మరింత వేగం పుంజుకుంటాయని భావించారు. ప్రస్తుతం విజయవాడ నుంచి పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో నిర్ణయాలు, వాటి అమలులో తెలియకుండానే జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తక్షణం కార్యాలయం అందుబాటులోకి తీసుకురావాలని పనులు ప్రారంభించినా.. అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ముందుగా వేసిన అంచనాలను మించి అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది. అస్తవ్యస్త నిర్మాణాల తొలగింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రూ. 5 కోట్లకు పైగా ఖర్చు అయిందని, ఇంకా ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు నిర్విరామంగా పనిచేసినా మరో నాలుగు నెలల వరకూ కార్యాలయం అందుబాటులోకి వచ్చే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.

వినూత్న ఆలోచనలతో స్వచ్ఛమైన గాలినందిద్దాం

- సత్ఫలితాలనిస్తున్న పీసీబీ, వీఎంసీల విస్తృత కార్యక్రమాలు
- ఎలక్ట్రిక్, సోలార్ రిక్షాల వినియోగం దిశగా ప్రజలను ప్రోత్సహించాలి
- ఎన్‌సీఏపీ సమావేశంలో ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యాన చంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభంనోఖ్వాల్ తదితరులు


ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతో విజయవాడ నగర వాసులకు స్వచ్ఛమైన గాలినందిద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించేందుకు విజయవాడ నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. నగరంలో వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన కార్యక్రమాల అమలు, అవి ఇచ్చిన ఫలితాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 2021-22 నుంచి 2025-26 మధ్య కాలంలో గాలిలో పీఎం 10 సూక్ష్మ ధూళికణాలను 20 నుంచి 30 శాతం మేర తగ్గించే లక్ష్యంతో ఎన్‌సీఏపీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కీలక భాగస్వామ్యంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన కార్యక్రమాలతో పీఎం 10 స్థాయి 61.8కి తగ్గిందన్నారు. ఇది 2021-22లో 67గా ఉండేదని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వాయు కాలుష్యాన్ని బాగా తగ్గించేందుకు చొరవ చూపాలన్నారు. బ్యాటరీ వాహనాలతో పాటు విద్యుత్, సోలార్ ఈ-రిక్షాలను ప్రోత్సహించాలని, ఇందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం కింద చేపట్టిన పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. హాట్‌స్పాట్‌లను గుర్తించి గాలి నాణ్యతను పెంచేలా మిస్ట్ స్ప్రింక్లింగ్‌కు డ్రోన్‌లను ఉపయోగించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, డీఎస్‌వో ఎ.పాపారావు, డీపీవో డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచండి : కలెక్టర్

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అంతరాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్ఏ) సమావేశం జరిగింది. ప్రస్తుతం జిల్లాలోని రీచ్‌ల్లో తవ్వకాలకు అందుబాటులో ఉన్న ఇసుక, ఇప్పటి వరకు సరఫరా చేసిన ఇసుక, భవిష్యత్ కార్యకలాపాలు తదితరాలపై చర్చించారు. జిల్లాలోని 15 రీచ్‌ల్లో 11,06,400 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు సిద్ధంగా ఉందని మైన్స్ అండ్ జియాలజీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో పర్యావరణ, ఇతర అనుమతుల ఆధారంగా తవ్వకాలు జరిగేలా, సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలన్నారు. చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలని, రెవెన్యూ, పోలీసు, మైన్స్ అండ్ జియాలజీ తదితర శాఖల అధికారులతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. లోడింగ్ విషయంలో పరిమితి మించకుండా చూడాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద కార్యకలాపాలు పగటి సమయంలో మాత్రమే జరిగేలా చూడాలని వివరించారు.

అది మహానాడు రోడ్డే

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వైసీపీ ప్రభుత్వంలో దేవినేని రాజశేఖర్ రోడ్డుగా పేరు మార్పు
- నాటి కౌన్సిల్ తీర్మానాన్ని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం



మహానాడు రోడ్డు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడలో చరిత్ర కలిగిన మహానాడు రోడ్డు వివాదానికి రాష్ట్ర ప్రభుత్వం బ్రేక్ వేసింది. మహానాడు రోడ్డు పేరును మార్చుతూ వైసీపీ ప్రభుత్వంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇకపై మహానాడు రోడ్డుగానే పిలవాలని శుక్రవారం అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది. గత మూడున్నరేళ్లుగా తలెత్తుతున్న వివాదానికి చెక్ పెట్టినట్టు అయింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పేరు మార్చింది. ఆ వెంటనే వైసీపీ నాయకులు చరిత్ర కలిగిన మహానాడు రోడ్డు పేరును మార్చివేశారు. వైసీపీ నేత దేవినేని అవినాష్ ప్రోద్బలంతో ఆయన తండ్రి దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) రోడ్డుగా మార్పించారు. 2021, సెప్టెంబరు 30న కౌన్సిల్ సమావేశంలో మహానాడు రోడ్డును కాస్తా దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) రోడ్డుగా పేరు మార్చుతూ కౌన్సిల్ తీర్మానం చేశారు. దీనిపై కౌన్సిల్‌లో అప్పటి టీడీపీ కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ విజ్ఞప్తిని వినలేదు.

కమిషనర్‌కు గద్దె లేఖ

ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. ఎమ్మెల్యే లేఖపై స్పందించిన కమిషనర్ రికార్డులను పరిశీలించి పేరు మార్పుకు ఆదేశించారు. మహానాడు రోడ్డుగా మళ్లీ పేరు మార్చగానే.. వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సూచనల మేరకు మునునూరి సుబ్బారావు దీనిపై కోర్టులో కేసు వేశారు. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరిగింది. కార్పొరేషన్ అధికారులకు పూర్తి సమాచారాన్ని తెలియజేయాల్సిందిగా ఆదేశించింది. ఆ తర్వాత పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. మహానాడు రోడ్డు పేరుపై వైసీపీకి చెందిన వారు దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) రోడ్డుగా స్టిక్కర్ అంటించారు.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

ఈ వివాదంపై ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మళ్లీ మునిసిపల్ కమిషనర్‌కు ఈ రోడ్డు చరిత్ర వివరిస్తూ లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించిన కమిషనర్ పాత రికార్డులను పరిశీలించి, స్థానికుల అభిప్రాయాలను తెలుసుకుని సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఈ నివేదికను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం కౌన్సిల్ తీర్మానాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. కౌన్సిల్ తీర్మానాలు వివాదాస్పదంగా ఉన్నపుడు ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ యాక్ట్ - 1955 ప్రకారం ఆ తీర్మానాన్ని రద్దు చేసే అధికారం ఉంటుంది. ఆ అధికారాన్ని ఉపయోగించి కౌన్సిల్ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.

దుర్గమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



దుర్గమ్మకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి జనార్దనరెడ్డి దంపతులు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి దంపతులు శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను ఆలయ లాంఛనాలతో సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆశీర్వచన మండపంలో మంత్రి దంపతులకు వేద ఆశీస్సులు, శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ముగిసిన శ్యామలా నవరాత్రులు

దేవస్థానంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న శ్యామల నవరాత్రి పూజలు ముగిశాయి. యాగశాలలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వేద స్వస్తి, శాంతి మంత్రాలను పఠించి పీఠానికి హారతులు సమర్పించారు. శ్యామలాదేవి అనుగ్రహం కోరుతూ పూజా సమర్పణ చేశారు. ఆలయ స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు. కాగా, ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. లక్ష కుంకుమార్చన, చండీ హోమం, నవావరణార్చనల్లో భక్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ బకింగ్ హాంపేటకు చెందిన గోలి శ్రీనివాసరావు ఆలయంలో అన్నదానం నిమిత్తం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి

● ప్రభుత్వానికి కమర్షియల్ ట్యాక్స్ మాజీ జాయింట్ కమిషనర్ పుల్లా జకరయ్య విజ్ఞప్తి



ధర్నాచౌక్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): తన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న అంబాపురం సర్పంచ్, ఆయన అనుచరుల నుంచి తనకు రక్షణ కల్పించాలని కమర్షియల్ ట్యాక్స్ మాజీ జాయింట్ కమిషనర్ పుల్లా జకరయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. తన స్నేహితుడి భార్య వలసల సదనం నీరజతో కలిసి విశాఖపట్నం సీతమ్మధారకు చెందిన దాట్ల ఝాన్సీరాణి అనే ఆమె దగ్గర విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో 2,597.44 చ.గ.లు ఖాళీ నివేశనా స్థలాన్ని కొనుగోలు చేసి 2024న ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో అంబాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ గండికోట సీతయ్య మా స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. దీనిపై 2024, ఆగస్టు 2న హైకోర్టులో కేసు వేయగా 2025, జనవరి 7న మాకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. మా స్థలం పక్కనే గ్రామ పంచాయతీకి చెందిన 2000 చదరపు గజాల ఖాళీ స్థలం ఉందని, ఆ స్థలంలో మా స్థలాన్ని కలుపుకునేందుకు సర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు చూస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేస్తామని తప్పుడు వాగ్దానాలు చేసి రెచ్చగొడుతున్నారన్నారు. ఈ నెల 3న మా స్థలాన్ని శుభ్రం చేసుకుంటుండగా, సర్పంచ్ ప్రోద్బలంతో అతని అనుచరులు యడ్లపల్లి వసంత్ కుమార్, గండికోట గురవయ్య అనే వ్యక్తులు వచ్చి మాపై భౌతికదాడికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ స్థలం వదిలి వెళ్లిపోవాలని, లేదంటే మీ అంతు చూస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ నెల 4న రాత్రి సమయంలో సుమారు 20 మంది మద్యం తాగి వచ్చి మారణాయుధాలతో మా వాచ్‌మెన్ దొండపాటి దానుపై దాడి చేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు విజ్ఞప్తి చేశారు.

వైఎస్ షర్మిలకు విమానాశ్రయంలో ఘనస్వాగతం

గన్నవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలకు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి శుక్రవారం రాత్రి విచ్చేశారు. షర్మిలకు పలువురు కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ఆమె నివాసానికి వెళ్లారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



పరాసుపేటలోని నెం.21 రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీవో స్వాతి

ఆర్డీవో రేషన్‌షాపుల తనిఖీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరంలోని పరాసుపేటలోని నెంబరు 21 రేషన్‌డిపోను శుక్రవారం ఆర్డీవో స్వాతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నిల్వలపై ఆరాతీసి రిజిస్టరును పరిశీలించారు. ఆర్డీవో పాటు తహసీల్దార్ నాగభూషణం, ఆర్ఐ శేఖర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. అనంతరం రైసుమిల్లులను కూడా తనిఖీ చేశారు.

తడి,పొడిచెత్తను విడివిడిగా సేకరించాలి



సర్కారుతోటలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డాక్టర్ ఆనందకుమార్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడిచెత్తను వేర్వేరుగా ప్రజలు పారిశుధ్య కార్మికులకు అందించాలని డిప్యూటీ సీఈవో, నోడల్ అధికారి డాక్టర్ ఆనందకుమార్ అన్నారు. నగరంలోని నాల్గో డివిజన్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. సర్కారుతోట, చిలకలపూడి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. గృహిణులు చెత్తను ఇంటి ముందు పోయవద్దని హితవు పలికారు. కె. కృష్ణప్రియ, విజయలక్ష్మి పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘీయులు

వైభవంగా శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

చల్లపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాలజ్ఞాన ప్రదాత విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి గోక్షీరాభిషేకం, కలశ ప్రతిష్ఠ, అఖండ జ్యోతి, ధ్వజప్రతిష్ఠను జరిపారు. వేదపండితులు కొండిపర్తి లీలా జయకృష్ణమాచారి బ్రహ్మత్వంలో కల్యాణోత్సవం నిర్వహించారు. కవులూరి పేరయ్యాచారి, పూసపాటి సాయికమల్, పట్నాల నాగమల్లేశ్వరరావు, శామీరుపేట నాగ వెంకట జయకాంత్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణోత్సవం జరిపారు. మండల విశ్వ బ్రాహ్మణ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు శామీరుపేట సాయిబాబు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, కేశనకుర్తి శరత్‌బాబు, అడ్డాడ ప్రసాద్‌బాబు, డోలా శ్రీనివాసరావు, అయ్యంకి నాగబ్రహ్మచారి, కేశనకుర్తి రవీంద్రబాబు అడ్డాడ వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మూడు వేల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గజమాల యాత్రలో పాల్గొన్న మిస్ ఆసియా కుమారి భావన

లక్ష్మీనరసింహస్వామి గజమాల యాత్ర ప్రారంభం

బంటుమిల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి గజమాల యాత్రలో మిస్ ఆసియా కుమారి భావన పాల్గొన్నారు. చోరంపూడి నుంచి బంటుమిల్లి, లక్ష్మీపురం, పల్లెపాలెం మీదుగా అంతర్వేది వెళ్లే గజమాల యాత్రలో భావన పాల్గొని సంఘీభావం తెలిపారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, డైరెక్టర్లు యాత్రను ప్రారంభించారు. మిస్ యూనివర్సల్ భావనను అగ్నికుల క్షత్రియులు ఘనంగా సన్మానించారు.



నందమూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

పెడన రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని పెడన ఎమ్మెల్యే కాగితకృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజు గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు. నందమూరులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ పాలనలోనే రాష్ట్రం పురోగతి సాధిస్తుందని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా పాలన ఉంటుందన్నారు. విద్యావంతులైన ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుని ప్రధమ ప్రాధన్యతా ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేయాలన్నారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలు రేపటి నుంచి



పెడన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దేవాంగ కులస్థుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలు బ్రహ్మపురంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూల నుంచి దేవాంగులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉత్సవాల్లో భాగంగా 50 వేల మందికి భారీ అన్నసమారాధన జరుగుతుంది. ఉత్సవాల నిర్వహణ కోసం శ్యామలాంబ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు దీక్షానందుడు సారథ్యంలో 50 మంది యువకులతో కమిటీని నియమించారు. చౌడేశ్వరీదేవి ఆలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సోమవారం తెల్లవారుజామున 4.35 గంటలకు ఆనపూజ, మంగళవారం రాత్రి 7.35 గంటలకు కౌమారకం, 12.55 గంటలకు జ్యోతిప్రజ్వలన, అలుగుసేవ, బుధవారం రాత్రి 7,45 గంటలకు నగరోత్సవం, కత్తుల ఊరేగింపు నిర్వహిస్తారు. జ్యోతిర్మహోత్సవాలత్యేక పూజలను ఊటుకూరి ఏక్‌నాథ్ సుధీర్‌కుమార్, హేమకనకదుర్గ నాగరాణి దంపతులు నిర్వహిస్తారు.

అర్తమూరు సర్పంచ్‌కు తప్పిన ప్రమాదం



బంటుమిల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అర్తమూరు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అర్తమూరు సర్పంచ్ బొర్రా రమేష్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. అర్తమూరు నుంచి బయలుదేరిన సర్పంచ్ కారును జాతీయ రహదారిపై బంటుమిల్లి నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. కారు దెబ్బతిన్నప్పటికీ సర్పంచ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.



చిలకలపూడి మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు సూచనలు చేస్తున్న విశ్రాంత అధ్యాపకుడు దిట్టకవి



మోపిదేవి జడ్పీ పాఠశాల 76వ వార్షికోత్సవంలో నృత్యప్రదర్శన

ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని విద్యార్థులు పరీక్ష రాస్తే విజయం తథ్యమని హిందూ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు దిట్టకవి వెంకటేశ్వరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. బందరు డివిజన్‌లో ఎక్కువ మంది 10వ తరగతి విద్యార్థులు ఉన్న చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. గత ఏడాది ఈ పాఠశాలలో 180 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షకు హాజరయ్యారని, ఈ ఏడాది కూడా 180 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. విద్యార్థుల్లో పరీక్ష అంటే భయం లేకుండా చేశామన్నారు. టౌన్ ఫస్ట్ సాధించిన ఇద్దరు విద్యార్థులు ఒక్కొక్కరు రూ. లక్ష చొప్పున రూ. 2 లక్షలు పూర్వ విద్యార్థుల నుంచి బహుమతులు పొందారన్నారు. తల్లిదండ్రులతో విమానం ఎక్కి హైదరాబాద్ వెళ్లి ఎవరు లక్ష రూపాయల ప్రైజ్ తీసుకుంటారో చిలకలపూడి విద్యార్థులు నిర్ణయించుకోవాలన్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు విద్యార్థులకు గీటురాయి అన్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు పబ్లిక్ పరీక్షలకు ఒక సోపానం వంటిదని, ఏ సబ్జెక్టు వీక్‌గా ఉందో తెలుసుకుని దానిపై సారించాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం పి.వి.కృష్ణమూర్తి, స్కూల్ అసిస్టెంట్ సింహాద్రి పాల్గొన్నారు.

ఘనంగా మోపిదేవి జడ్పీ పాఠశాల 76వ వార్షికోత్సవం



మోపిదేవి ప్రధాన కూడలిలో డప్పు వాయిస్తూ నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మోపిదేవి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 76వ వార్షికోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. గ్రామసర్పంచ్ నందిగం మేరీ రాణి జాతీయ పతాక ఆవిష్కరణ చేయగా, ప్రధానోపాధ్యాయురాలు పి.జయంతి పాఠశాల నివేదికను సమర్పించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ బృం దం ఆధ్వర్యంలో విద్యార్థులు డప్పు వాయిద్యాలు ప్రదర్శిస్తూ పాఠశాల నుంచి ప్రధాన కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల విద్యార్థినులు స్వాగత గీతం ఆలపిస్తూ చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ 75 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనభ్యసించి ఎంతో మంది దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. రాబోయే కాలంలో పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వివిధ క్రీడలు, పోటీల్లో ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సహాయ కార్యదర్శి రావి నాగేశ్వరరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ప్రేరణ సదస్సు సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

అవనిగడ్డ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తే విజయం తథ్యమని వక్తలు పేర్కొన్నారు. అవనిగడ్డలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు ప్రతిభకు ప్రేరణ, అవగాహన సదస్సు నిర్వహించారు. రాబోయే పదవ తరగతి ఫలితాల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు వారిలో ప్రేరణ కలిగించేలా విద్యావేత్తలతో మోటివేషన్ తరగతులను ఏర్పాటు చేశారు.

అవనిగడ్డ, మచిలీపట్నం ఏఎస్‌డబ్ల్యూవో మోహనరావు, ఎస్.రాజశేఖర్ రెడ్డి, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు వీరకుమారి, దివిసీమ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.టి.సత్యప్రసాద్, అవనిగడ్డ-2 ఎంఈవో పిచ్చియ్య తదితరులు మాట్లాడారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వసతి గృహ సంక్షేమాధికారి అనురాధ పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న డీటీవో స్వర్ణశ్రీనివాస్ నాయక్



మాట్లాడుతున్న డాక్టర్ గోవాడ ప్రశాంతి

చల్లపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత అందరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా రవాణాధికారి బి.స్వర్ణ శ్రీనివాస్ నాయక్ అన్నారు. భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామానగరంలోని చల్లపల్లి పబ్లిక్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, స్కూల్ పిల్లలు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, రోడ్డు దాటేప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. హెల్మెట్ లేకుండా, సీట్‌బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయటం ప్రమాదకరమన్నారు. ఎవరైనా చేస్తే అది తప్పు అని పిల్లలు హితబోధ చేసి సీటు బెల్ట్, హెల్మెట్ పెట్టుకోవాలంటూ సూచించాని వివరించారు. రోడ్డు పక్కన ఉండే గుర్తులను, వాటి అర్థాలను పిల్లలకు వివరించారు. అసిస్టెంట్ ఎంవీఐ సిహెచ్.సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ శ్యాం ప్రసాద్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హక్కులు తెలుసుకోవాలి

చల్లపలి : ప్రతి ఒక్కరూ తమ హక్కులు తెలుసుకోవాలని విశ్రాంత ప్రభుత్వ న్యాయవాది అహ్మదున్నీసా కోరారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మానవ హక్కులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవ హక్కులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ, మహిళా రక్షణ చట్టాలు, డ్రగ్స్ నియంత్రణ, మానవ అక్రమ రవాణా నిర్మూలన, సీనియర్ సిటిజన్ హక్కుల పరిరక్షణ, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో డాక్టర్ ఎ.వి.రమణ, ఎస్సై పిఎస్ వి.సుబ్రహ్మణ్యం, పురిటిగడ్డ వైద్యాధికారిణి డాక్టర్ కె.వి.పద్మావతి, కార్యదర్శి ఎన్.యూనీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రోగికి సీఎం సాయం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నాల్గో డివిజన్‌లో నివసిస్తున్న టీడీపీ కార్యకర్త తోపుల శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులకు గురయిన శ్రీనివాస్ పరిస్థితిని టీడీపీ నాయకురాలు కరెడ్ల సుశీల మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో అతనికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద శుక్రవారం రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేశారు. కరెడ్ల సుశీల, కార్పొరేటర్ పినిశెట్టి నాగఛాయాదేవి, పెద్ది రంగారావు, ప్రసాద్, విజయకుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

కానూరు జడ్పీ విద్యార్థుల ప్రతిభ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కానూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సబ్‌జోన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. టెన్నికాయిట్, కబడ్డీలలో విన్నర్స్‌గా, ఖోఖోలో రన్నర్స్‌గా నిలిచారు. విజేతలను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, గ్రామపెద్దలు దివి మహేష్, బొమ్మిడి ఏడుకొండలు, గోపు నరేష్, ఏసు, ఇమ్మానుయేల్, ప్రదీప్ అభినందించారు.

భర్త కన్పించడం లేదని ఫిర్యాదు

కోడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : భర్త కన్పించడం లేదని భార్య ఫిర్యాదు చేసింది. జరుగువానిపాలెం గ్రామానికి చెందిన మింగు బసవయ్య (50) గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య మీనాక్షి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.

పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా సైన్స్ ఆఫీసర్ మొహమ్మద్ జాకీర్ అహమ్మద్ అన్నారు. రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో గ్రీన్ టీచర్లకు వెట్‌లాండ్ అభివృద్ధి అంశంపై శిక్షణా తరగతులు జరిగాయి. చిత్తడి నేలల అభివృద్ధి, పరిరక్షణ అంశంపై విద్యార్థులు 12వ తేదీలోపుగా వివిధ అంశాలను చిత్రీకరించి పంపాలన్నారు.

గాయంపాడులో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెడన రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : గాయంపాడులో కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణం చేసి సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నసమారాధన జరిగింది.

ఉపాధి పనుల పరిశీలన

అవనిగడ్డ రూరల్ ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పేద వర్గాలకు ఎంతో మేలు చేస్తుందనికౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జివి.నగరాయులు అన్నారు. పులిగడ్డలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధి హామీ కూలీలను ఆయన కోరారు.

మహిళకు ఆర్థిక సాయం

అవనిగడ్డ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : షుగర్ వ్యాధితో బాధపడుతూ రెండు కాళ్లు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిన కాకి నాగమణికి దాతలు అందించి రూ.20,600 మొత్తాన్ని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ శుక్రవారం అందజేశారు. విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నాగమణిని కలిసిన గోవర్ధన్ ఫోన్ పే దాతలు పంపిన మొత్తాన్ని అందజేసి, ఆమెకు ధైర్యం చెప్పారు.

బాలిక వైద్యానికి విక్కుర్తి..

మోపిదేవి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి పంచాయతీ శివారు ప్రజాశక్తి నగర్ కాలనీకి చెందిన పి.నాగలక్ష్మణ మణికుమార్ - ఝాన్సీ దంపతుల కుమార్తె అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా, వైద్య ఖర్చుల నిమిత్తం విక్కుర్తి వీరరాఘవయ్య ఫౌండేషన్ తరపున శ్రీనివాసరావు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఫౌండేషన్ సభ్యులు విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర తదితరులు ఉన్నారు.

ఎంపీడీవోగా వెంకటేష్



పెడన రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : పెడన మండల పరిషత్ అధికారిగా సిహెచ్ వెంకటేష్‌ను నియమిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జయరామ పదవీ విరమణ చేయగా వెంకటేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

తండ్రీకూతుళ్లకు గాయాలు

గూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. ఐదుగుళ్లపల్లికి చెందిన గోవాడ సుబ్బారావు వీఆర్వోగా పని చేస్తూ కంకిపాడులో నివాసం ఉంటున్నాడు. ఐదుగుళ్లపల్లిలో శుభకార్యం ఉండడంతో కుమార్తె రవళితో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద నాన్‌స్టాప్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుబ్బారావు, రవళిలను బందరు ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



పరాసుపేటలోని రేషన్ డిపోను పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి

ఆర్డీవో రేషన్‌షాపుల తనిఖీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరంలోని పరాసుపేటలోని నెంబరు .21 రేషన్‌డిపోను శుక్రవారం ఆర్డీవో స్వాతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నిల్వలపై ఆరాతీసి రిజిస్టరును పరిశీలించారు. ఆర్డీవో పాటు తహసీల్దార్ నాగభూషణం, ఆర్ఐ శేఖర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. అనంతరం రైసు మిల్లులను కూడా తనిఖీ చేశారు.



మల్లాయపాలెంలో శక్తిదుర్గా ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : హిందూ సంస్కృతి, సాంప్రదాయాలకు గుడివాడ నియోజకవర్గం జిల్లాలో ముందుంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మల్లాయపాలెంలోని శ్రీకాళహస్తీ కాలనీలో శ్రీశక్తి దుర్గా ఆలయ పంచయతన క్షేత్రం, వృద్ధాశ్రమానికి భూమి పూజ నిర్వహించారు. గుడివాడ గుడుల వాడగా ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. శక్తిదుర్గ ఆలయ పంచయతన క్షేత్రం నిర్మించటం సంతోషకరమైన విషయమని కమిటీ సభ్యులను అభినందించారు. భూమి పూజా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటల 26 నిముషాలకు పద్మశ్రీ వేలు ఆనందాచారి ఆధ్వర్యంలో వందలాది మంది భకులు పాల్గొన్నారు. అనంతరం వేలాది మందికి అన్నసమారాధన జరిగింది. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వలివర్తిపాడులో ఆటోలను తనిఖీ చేస్తున్న ఎస్సై చంటిబాబు

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్సై చంటిబాబు సూచించారు. వలివర్తిపాడు, మోటూరు, బొమ్ములూరు, లింగవరం తదితర గ్రామాల నుంచి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు, ప్రభుత్వ పాఠశాలలకు తరలించే ఆటోలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పరిమితికి మించి పిల్లలను ఎక్కిం చుకోవద్దన్నారు. స్కూల్ బ్యాగులు వేరే ప్రదేశంలో పెట్టాలన్నారు. డ్రైవర్ పక్కన ఎక్కించుకోవద్దని, వెనుక సీట్లలో మాత్రమే విద్యార్థులను కూర్చోబెట్టుకోవాలన్నారు. పిల్లలను తీసుకుని వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



ఉమెన్ సేఫ్టీ యాప్‌లను డౌన్‌లోడ్ చేయిస్తున్న శక్తి టీం సభ్యులు, ఎస్సై జాస్మిన్

మహిళల భద్రతకు ఉమెన్ సేఫ్టీ యాప్

గుడివాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని టూటౌన్ ఎస్సై జాస్మిన్ కోరారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ సి.హెచ్ నాగప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం స్దానిక బస్టాండ్‌లో విద్యార్థినుల స్మార్ట్ ఫోన్‌లలో ఉమెన్ సేఫ్టీ యాప్‌లను డౌన్‌లోడ్ చేయించి, వినియోగంపై అవగాహన కల్పించారు. వివరించారు. విద్యార్థినులు, మహిళలు అత్యవసర సమయాల్లో ఈ యాప్‌ను వినియోగిస్తే సకాలంలో పోలీస్‌శాఖ స్పందించి రక్షణ కల్పిస్తుందన్నారు. రాత్రి వేళల్లో దూరపు ప్రయాణ సమయాల్లో యాప్‌ను వినియోగిస్తే సదరు ఫిర్యాది లోకేషన్‌ను పోలీసు శాఖ ట్రాకింగ్ చేసి రక్షణ కల్పిస్తుందన్నారు. సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిగత సమాచారాన్ని పోస్ట్ చేసినప్పుడు సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తే ఈ యాప్ కట్టడి చేస్తుందన్నారు. శక్తి టీం సభ్యులు, విద్యార్దులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి

చట్టాలపై అవగాహన ఉండాలి

పెదపారుపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. యలమర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో యాక్టు, మోటారు వాహనాల చట్టం, డయల్ 112 అంశాలను ఆసాంతం వివరించారు. లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే (పోక్సో) గురించి విద్యార్థినులు తెలుసుకోవాలన్నారు. మైనర్‌పై లైంగిక వేధింపులకు కనీసం 20 సంవత్సరాలు జైలుశిక్ష, దీనిని జీవిత ఖైదు ఉంటుందన్నారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్య ఉన్నా తనను కలిసి తెలియజేయాల్సిందిగా సూచించారు.

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

ఉంగుటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం బాగోలేదంటూ తరచుగా పాఠశాలకు వెళ్లని కూతురిని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన కూతురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆత్కూరులో జరిగింది. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొల్లకట్టు సన్నుతి(15)అనే విద్యార్థిని స్థానిక జడ్పీహైస్కూల్‌లో పదవతరగతి చదువుతోంది. ఆరోగ్యం బాగోలేదనే కారణంతో తరచుగా పాఠశాలకు సెలవుపెడుతున్న కూతుర్ని గురువారం ఉదయం తల్లి మందలించి ఇంటి బయట పనుల్లో నిమగ్నమైంది. దీంతో మనస్తాపం చెందిన సన్నుతి ఇంట్లో వెండివస్తువులు శుభ్రం చేసుకునేందుకు తెచ్చిన లిక్విడ్ యాసిడ్‌ను తాగింది. గమనించిన తల్లి వెంటనే గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా వుండటంతో మెరుగైన వైద్యంకోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఏఎస్సై ఆర్.రామారావు కేసు నమోదు చేశారు.

రైతుల ఆశలన్నీ మినుముపైనే

- విచక్షణారహితంగా పురుగు మందుల వాడకం
- రైతులు అప్రమత్తం కావాలని శాస్త్రవేత్తల సలహా
- తెగుళ్ల నివారణ చర్యలకు వ్యవసాయాధికారుల సూచనలు



మినుము పైరుపై పురుగు మందులు పిచికారి చేస్తున్న రైతులు

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్)

రైతుల ఆశలన్నీ మినుము దిగుబడిపైనే పెట్టుకున్నారు. గుడివాడ మండలంలో రెండో పంటగా మినుమును వేలాది ఎకరాల్లో సాగు చేశారు. ముఖ్యంగా మోటూరు, తట్టివర్రు, రామన్నపూడి, చౌటపల్లి, మల్లాయిపాలెం తదితర గ్రామాల్లో 15 వేల ఎకరాలకుపైగా మినుము పైరు వేశారు. మినుము పూత, పిందె దశలో ఉంది. మినుములో ప్రస్తుతం బూడిద తెగులు, గజ్జి తెగులు, పల్లాకు తెగులు, సీతాఫలం తెగులు కన్పిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మినుములో సస్య రక్షణ చర్యల్లో భాగంగా రైతులందరూ విపరీతంగా పురుగుమందులు వాడుతున్నారు. అవగాహనాలోపంతో ఎక్కువ ఖర్చుతో పురుగు మందులు వాడడం వల్ల ఆర్థికంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. రసాయన ఎరువులు ఎక్కువగా వాడడం వల్ల మినుము పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులు తెలుపుతున్నారు. దీనికితోడు ఎలుకల బెడద విపరీతంగా ఉంది. కొంతమంది రైతులు ఎలుకల నివారణకు బుట్టలు పెట్టించుకుంటున్నారు. కొంతమంది రైతులు రసాయనిక చర్యల ద్వారా ఎలుకల నివారణ చేస్తున్నారు.

బయోపెస్టిసైడ్స్ వాడొద్దు



వ్యవసాయ అధికారులు చేసిన సిఫార్సుల ప్రకారమే మినుము పైరుపై పురుగు మందులు పిచికారీ చేయాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. బలం కోసం బయో పెస్టిసైడ్స్ చల్లుతున్నారని, అలా చల్లటం వల్ల ఖర్చులు ఎక్కు వ కావటమే గానీ, రైతులకు ఎలాంటి ఉపయోగడం ఉండదన్నారు.

- ఏడీఏ రమాదేవి

విచక్షణారహితంగా వాడొద్దు



మినుములో బూడిద తెగులు, గజ్జి తెగులు, సీతాఫలం తెగుళ్ల కన్పిస్తున్నాయని ఏవో బోలెం అనంతలక్ష్మి తెలిపారు. రైతులు తక్కువ మోతాదులో రసాయన మందులు వాడాలన్నారు. ఎరువుల షాపులో ఏ మందు లు తెచ్చి మినుముకు వినియోగించరాదన్నారు.

- ఏవో అనంతలక్ష్మి

తండ్రీకూతుళ్లకు గాయాలు

గూడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. ఐదుగుళ్లపల్లికి చెందిన గోవాడ సుబ్బారావు వీఆర్వోగా పనిచేస్తూ కంకిపాడులో నివాసం ఉంటున్నాడు. ఐదుగుళ్లపల్లిలో శుభకార్యం ఉండడంతో కుమార్తె రవళితో కలిసి ద్విచక్రవాహనంపై వస్తుండగా రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద నాన్‌స్టాప్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగాగా యపడిన సుబ్బారావు, రవళిలను బందరు ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

పెనమకూరు జడ్పీ విద్యార్థుల ప్రతిభ

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో పెనమకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు బొప్పన శ్రీనివాసరావు, పీడీ కంచర్ల బాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరు అభిషేక్ 200 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు పరుగు పందెంలోను, లాంగ్‌జంప్‌లోను ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్, వ్యక్తిగత చాంపియన్ షిప్ సాధించాడన్నారు. సమ్మంగి భానుప్రసాద్ 3000 మీటర్లు, 1500 మీటర్లు పరుగు పందెంలో వెండి పతకం, 800 మీటర్లు పందెంలో తృతీయ స్థానంతో కాంస్య పతకం సాధించాడన్నారు. అభిషేక్, భానుప్రసాద్‌లను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు బొప్పన శ్రీనివాసరావు, పీడీ కంచర్ల బాలు, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, ఎస్ఎంసీ చైర్మన్ గుండాల సంతోషిరాణి, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.



పతకాలు పొందిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్



విజేతలతో హెచ్ఎం సుబ్రహ్మణ్యం, విద్యార్థులు

భట్లపెనుమర్రు జడ్పీ పాఠశాల విద్యార్థుల

కూచిపూడి : గోగినేనిపాలెంలో నిర్వహించిన సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో భట్లపెనుమర్రు జడ్పీ పాఠశాల విద్యార్థులు పలు అంశాల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల విద్యాకుటుంబం అభినందించింది. ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, పీఈటీ కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీఆదిత్య విద్యార్థులకు ఉద్యోగాలు

గుడివాడ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : క్యాంపస్ ఎంపికల్లో శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు తెలిపారు. కళాశాల ఆవరణలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఐఎల్ఎం కంపెనీకి నలుగురు, సంధ్య ఆక్వాలో ఒకరు, టీసీఎస్-బీపీసీ హెట్రో డ్రగ్స్ కంపెనీల్లో విద్యార్థులు ఉద్యోగాలు పొందారని తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, అధ్యాపకులు అభినందించారు.



ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

10 నుంచి చౌడేశ్వరీదేవి జ్యోతిర్మహోత్సవాలు



పెడన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): దేవాం గ కులస్థుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీ దేవి జ్యోతిర్మహోత్సవాలు బ్రహ్మపురంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశా రు. రాష్ట్రం నలుమూల నుంచి దేవాంగులు తరలివచ్చి ఉత్సవాలలో పాల్గొంటారు. ఉత్సవాలలో భాగంగా 50 వేల మందికి భారీ అన్నసమారాధన జరుగుతుంది. ఉత్సవాల నిర్వహణ కోసం శ్యామలాంబ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు దీక్షానందుడు సారథ్యంలో 50 మంది యువకులతో కమిటీని నియమించారు. సోమవారం తెల్లవారుజామున 4.35 గంటలకు ఆనపూజ, మంగళవారం రాత్రి 7.35 గంటలకు కొమారకం, 12.55 గంటలకు జ్యోతిప్రజ్వలన, అలుగుసేవ, బుధవారం రాత్రి 7.45 గంటలకు నగరోత్సవం, కత్తుల ఊరేగింపు నిర్వహిస్తారు. జ్యోతిర్మహోత్సవాలత్యేక పూజలను ఊటుకూరి ఏక్‌నాథ్ సుధీర్‌కుమార్, హేమకనకదుర్గ నాగరాణి దంపతులు నిర్వహిస్తారు.

లక్ష్మీనరసింహస్వామి గజమాల యాత్ర ప్రారంభం

బంటుమిల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్వేది లక్ష్మీనరసింహాస్వామి గజమాల యాత్రలో మిస్ ఆసియా కుమారి భావన పాల్గొన్నారు. చోరంపూడి నుంచి బంటుమిల్లి, లక్ష్మీపురం, పల్లెపాలెం మీదుగా అంతర్వేది వెళ్లే గజమాల యాత్రలో భావన పాల్గొని సంఘీభావం తెలిపారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, డైరెక్టర్లు యాత్రను ప్రారంభించారు. మిస్ యూనివర్సల్ భావనను అగ్నికుల క్షత్రియులు ఘనంగా సన్మానించారు.



బీసీలకు 34 శాతం పదవులు హర్షణీయం

నందివాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం ఇవ్వడం పట్ల టీడీపీ బీసీ నాయ కులు, జిల్లా కళింగ సాధికార కమిటీ అధ్యక్షుడు సింగవరపు ప్రభాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. దేశ జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ అమలు కోసం బీసీ సంఘాలు చేపట్టే పోరాటానికి కూటమి ప్రభుత్వం మద్దతుగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో బీసీలకు కూటమి ఇచ్చిన హామీలను ప్రణాళికాబద్ధంగా ఒక్కొక్కటి అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపారుపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ప్రతి రెండో శనివారం పెదపారుపూడి మండల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతందని గుడివాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



చల్లపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాలజ్ఞాన ప్రదాత విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి గోక్షీరాభిషేకం, కలశ ప్రతిష్ఠ, అఖండ జ్యోతి, ధ్వజప్రతిష్ఠను జరిపారు. వేదపండితులు కొండిపర్తి లీలా జయకృష్ణమాచారి బ్రహ్మత్వంలో కల్యాణోత్సవం నిర్వహించారు. కవులూరి పేరయ్యాచారి, పూసపాటి సాయికమల్, పట్నాల నాగమల్లేశ్వరరావు, శామీరుపేట నాగ వెంకట జయకాంత్ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణోత్సవం జరిపారు. మండల విశ్వ బ్రాహ్మణ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు శామీరుపేట సాయిబాబు, నడకుదురు లీలబ్రహ్మేంద్ర, కేశనకుర్తి శరత్‌బాబు, అడ్డాడ ప్రసాద్‌బాబు, డోలా శ్రీనివాసరావు, అయ్యంకి నాగబ్రహ్మాచారి, కేశనకుర్తి రవీంద్రబాబు అడ్డాడ వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.